


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 17-07-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 291 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బ్రహ్మోస్ ప్రయోగం

# సూపర్ సక్సెస్..

**ప్రతికూల వాతావరణంలోనూ తిరుగులేని క్షిపణి ధ్వని వేగంకంటే మూడు రెట్లు ఎక్కువ**



న్యూఢిల్లీః గాలిలో ధ్వని వేగం కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణించే సూపర్‌సోనిక్ క్షిపణి బ్రహ్మోస్‌ను సోమవారం విజయవంతంగా ప్రయోగించారు. ఒడిశాలోని బాలాసోర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి ఉదయం 10.30 గంటలకు డీఆర్డీఓ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో దీన్ని పరీక్షించారు. క్షిపణి జీవన కాలాన్ని పెంపొందించడానికి ఉపయోగపడే తరువాయి 2లో..

## ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి మట్టం



వార్త 2వ పేజీలో..

## గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే

# గ్రామదర్శిని



- 100 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామదర్శిని
- ఒక్క ఓటు వేరేవారికి వేసినా అన్యాయం చేసినట్లే...
- జగన్, బీజేపీ నాయకులు.. గడ్కరీకి లేనిపోనివి చెప్పారు
- గ్రామదర్శిని ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రాన్ని ఎన్నో విధాల అభివృద్ధి చేస్తున్న తనకు ప్రజలు అండగా నిలవాలని... ఒక్క ఓటు వేరే వారికి వేసినా అన్యాయం చేసినట్లేనని సిఎం చంద్రబాబు గుంటూరు జిల్లా పర్యటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు శిలఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

**జగన్, బీజేపీ నాయకులు.. గడ్కరీకి లేనిపోనివి చెప్పారు**

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1500 రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ గ్రామదర్శిని అనే సరికొత్త కార్యక్రమానికి తరువాయి 2లో..

## మమత కోటలో సిండికేట్ రాజకీయాలు

**ధైర్యంగా దానిని ఎదిరించండి**

**ప్రధాని మోదీ**



మిడ్నాపూర్: మమతా బెనర్జీ కంచుకోటలో ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజల ఆశలు, ఆకాంక్షలను ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం అణగదొక్కుతోందని, ఇక్కడి ప్రజల ఇక్కట్లకు సిండికేట్ రాజకీయాలే కారణమని ఆయన ఆరోపించారు. తృణమూల్ స్వార్థ రాజకీయాలు, విభజన రాజకీయాలతో రాష్ట్ర విలవిల్లాడుతోందని అన్నారు. పశ్చిమ మిడ్నాపూర్‌లోని కిసాన్ ర్యాలీలో ప్రధాని సోమవారం మాట్లాడుతూ, సిండికేట్లతోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని, అభివృద్ధిపై తరువాయి 2లో..

## ఏపీలో అవినీతి పాలన సాగుతోంది

**భాజపా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు**

**ఏపీ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అత్యాచారాలు, హత్యలు, ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా దోపిడీపైనే శ్రద్ధ పెట్టిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. జన్మభూమి కమిటీల నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని స్థాయిల్లోనూ అవినీతి విపరీతంగా జరుగుతోందని ఆరోపించారు. దిల్లీ పర్యటనలో ఉన్న కన్నా లక్ష్మీనారాయణ.. కేంద్ర హోంమంత్రి తరువాయి 2లో..

## మాదక ద్రవ్యాల నివారణకు విధివిధానాలు రూపొందించాలి



న్యూఢిల్లీ : మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు విధివిధానాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో డ్రగ్స్ వినియోగంపై సీబీఐ తరువాయి 2లో..

## చంద్రబాబు 1500 రోజుల పాలనలో

# అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి అభివృద్ధి చెందాయి

- ఏపీ అభివృద్ధిని విస్మరించారు
- ఎన్నికల హామీలు నెరవేర్చలేదు
- విశాఖ భూకుంభకోణాల సిట్ నివేదికను బయటపెట్టాలి
- వైకాపాను భూస్థాపితం చేస్తామనడం హాస్యాస్పదం
- వైకాపా అధికార ప్రతినిధి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 1500 రోజులు పూర్తి చేసుకున్నామంటూ సంబరాలు జరుపుకుంటున్న తెదేపా నాయకులు, మంత్రులు సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి బాగా అభివృద్ధి చెందాయని వైకాపా అధికార ప్రతినిధి, మాజీ మంత్రి, బొత్స తరువాయి 2లో..

## తెదేపాకు నైతిక మద్దతిస్తాం

## : కనిమొళి

చెన్నై: విభజన హామీల కోసం పోరాడుతున్న తెలుగుదేశం పార్టీకి డీఎంకే నైతిక మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఎంపీ కనిమొళి అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఎంపీలు చెన్నైలో కనిమొళితో సమావేశమయ్యారు.

విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు.. వాటిని నెరవేర్చడంతో ఎన్డీయే ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఆమెకు వివరించారు. పార్లమెంటులో తాము ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ.. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన విభజన హామీలనే నెరవేర్చాలని తెదేపా ఎంపీలు కోరుతున్నారని.. వారికి తాము అండగా ఉంటామన్నారు.

ఇటీవల కడపలో ఉక్కు కర్మాగారం కోసం తెదేపా ఎంపీ సీఎం రమేశ్ చేపట్టిన ఆమరణ దీక్షకు కనిమొళి సంఘీభావం తెలిపిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు నెరవేర్చాలని ఆమె కేంద్రాన్ని కోరారు.




## శరత్ హత్య కేసులో

# నిందితుడి కాల్చివేత

వాషింగ్టన్ /హైదరాబాద్: వరంగల్ జిల్లాకు చెందిన శరత్ కొప్పు ఇటీవల అమెరికాలోని కన్సాస్‌లో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. స్థానిక రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న శరత్‌పై ఓ దుండగుడు కాల్పులు జరపడంతో అతడు మృతిచెందాడు. కాగా.. ఈ ఘటనలో నిందితుడు తాజాగా పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు. శరత్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆచూకీని పోలీసులు నిన్న గుర్తించారు. నిందితుడిపై నిఘా పెట్టిన ఇద్దరు అండర్ కవర్ అధికారులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. నిందితుడు వారిపై కాల్పులు జరిపి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఇంతలో అక్కడికి వచ్చిన పోలీసులు నిందితుడిపై కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నిందితుడు చనిపోయినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు.

నిందితుడిని హతమార్చడంపై కన్సాస్‌లోని భారత అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శరత్ మృతికి న్యాయం జరిగిందని అసోషియేషన్ పేర్కొంది. అమెరికా కాలమానం ప్రకారం.. శరత్ జులై 6న హత్యకు గురయ్యాడు. వరంగల్‌కు చెందిన శరత్ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేసి ఆరు నెలల కిందటే అమెరికా వెళ్లాడు. మిస్సోరీ యూనివర్శిటీలో చదువుకుంటూనే కన్సాస్ నగరంలోని ఓ రెస్టారెంట్‌లో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే కాల్పుల ఘటన చోటుచేసుకుంది. రెస్టారెంట్‌కు వచ్చిన నిందితుడు ఆహారం ఆర్డర్ చేశాడు. దానికి బిల్లు అడగగా.. చెల్లించలేదు సరికదా డబ్బులు దోచుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నిందితుడు శరత్‌పై కాల్పులు జరిపాడు.



# చంద్రబాబు 1500 రోజుల పాలనలో అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి అభివృద్ధి చెందాయి

మొదటి పేజీ తరువాయి :

సత్యనారాయణ దుయ్యబట్టారు. విశాఖపట్నం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ దేశంపాలన 1500 రోజులు పూర్తిచేసుకుంటే ప్రజలకు ఒరిగిందేమీ లేదు. అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి బాగా అభివృద్ధి చెందాయి. సామాన్యులు విష జ్వరాలతో, లంచాల బాధతో, అప్పులతో బాధ పడుతున్నారు. ఆనందంగా ఉన్నది అధికారం అనుభవిస్తున్న వారు మాత్రమే.

ఎన్నికల హామీలు ఏమైనా నెరవేర్చారా? కనీసం ఆడపడుచులకు ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ అమలు చేశారా? అని ప్రశ్నించారు. రుణాలన్నీ మాఫీ అని అన్నారు. అధికారానికి వచ్చాక తలా పదివేలు మాత్రమే మాఫీ అన్నారు. చివరికి కొందరికి మూడు వేలు, మరికొందరికి ఆరు వేలు మాఫీ చేసి ఆడపడుచులకు అన్యాయం చేశారు. ఇపుడు మరో అయిదేళ్లు అధికారం ఇస్తే పూర్తి స్థాయి అభివృద్ధి సాధిస్తామని అనడం ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికేగుతానని అన్న చందాన ఉందని బొత్స చమత్కరించారు. పేపర్లలో టీవీల్లో ప్రకటనల్లో తప్ప అభివృద్ధి లేదు. ఎల్లకాలం అందర్నీ మోసం చేయలేమని గుర్తుంచుకోండి. ఏపీకి 4530 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఆరు లక్షల కోట్లు వచ్చాయని ప్రచారం చేస్తున్నారు. రామదాస్ అథవాలే అనే కేంద్ర మంత్రి అశోక్ గజపతిలాగే వేరె పార్టీ నుంచి కేంద్రమంత్రి అయ్యారు. ఆయన మీ గురించి, మా గురించీ ఏదో మాటాడితే అది పట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు చంద్రబాబు రాజగురువును కలిశారని పేర్కొన్నారు. ఎందుకంటే... టీడీపీ, బీజేపీని కలపడానికేనని, ఇది నిజం కాదా అని ఈ సందర్భంగా బొత్స ప్రశ్నించారు. టీడీపీ చేసిన అభివృద్ధి ఏంటో నేరుగా ప్రజలకే చెప్పాలని ఆయన సూచించారు. కాపులకు ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పాలని.. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చూపించకుండా 25 వేల కోట్ల రూపాయలను ఏ విధంగా రుణమాఫీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పెట్రో కెమికల్ కారిడార్‌ను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు 13 ఏళ్ల పాలనలో ఒక్క పరిశ్రమను కూడా ఏపీకి తీసుకురాలేదని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులు చదువుకునే పరిస్థితి లేదని ఆరోపించారు. నిరుపేద విద్యార్థుల చదువుల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రస్తుతం ఏపీలో అమలు కావడం లేదంటూ ఆయన ధ్వజమెత్తారు. విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏపీలో నెలకొందని ఆందోళ. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఇప్పటివరకూ రుణమాఫీ కాలేదన్నారు. వారికి 10వేల రూపాయలు ఇచ్చామనడం పచ్చి అబద్ధమని పేర్కొన్న ఆయన.. నగదు ఇచ్చామని నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. అశోక్ గజపతి రాజు, మీరూ కలిసి విమానయాన రంగంలో చేసిన అవినీతి మీద ఇంకా నోటీసులు వస్తూనే ఉన్నాయి. మీరా అవినీతి గురించి మాటాడేది లేదు ముందు విశాఖ భూకుంభకోణాలలో తెలుగుదేశం పెద్దల హస్తం ఉన్నందువలననే సిట్ నివేదిక బయటపెట్టడం లేదన్నారు. మీకు చిత్తశుద్ధిఉంటే సిట్ నివేదికను బహిర్గతం చేసి ప్రజల ముందుకు రావాలని, అప్పుడు అవినీతి పరులెవరో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రజలు 2014లో చంద్రబాబు గారడీలను నమ్మి మోసపోయారు. మళ్లీ మోసపోరాదు. వైకాపాని భూస్తాపితం చేస్తానని చంద్రబాబు అనటం హాస్యాస్పదం. వైఎస్ బతికుంటే మీ పార్టీ ఏనాడో భూస్తాపితమై పోయేది. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో హోదా సహా అన్ని అంశాలమీదా పోరాటం కొనసాగిస్తాం. చంద్రబాబు అపుడు వైకాపా ఎంపీలు రాజీనామా చేయాలన్నారు. ఇపుడు పార్లమెంటులో పోరాడాల్సి వస్తుందని రాజీనామా చేశారంటున్నారు. అది నాలుకా, తాటి మట్టా? అని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ గతంలో ఒక మాట చెప్పారు. కేంద్రం మీద అవిశ్వాసం పెడితే 50 మంది ఎంపీల మద్దతు కూడగడతానన్నారు.

మేము అవిశ్వాసం పెట్టాము. ఏం చేశాడాయన? అయినా పర్వాలేదు. రాష్ట్రానికి మేలు జరుగుతుందంటే పవన్‌తోనే కాదు, ఎవరితోనైనా కలవటానికి తమ పార్టీ చిత్తశుద్ధితో ఉందని బొత్స సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అధికార ప్రతినిధులు కొయ్య ప్రసాదరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, సమన్వయకర్తలు కె.కె. రాజు, తిప్పల నాగిరెడ్డి, కోలా గురువులు, యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, రవిరెడ్డి, కల్చరల్ విభాగం రాధ, జ్యోతి, తుల్లి చంద్రశేఖర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి మట్టం

భద్రాచలం : గత కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టుల్లో నీటి మట్టం పెరిగి జలకళ సంతరించుకుంది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నీటిని దిగువకు విడుదల చేయాల్సి వస్తోంది.

తూర్పుగోదావరి : జిల్లాలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి మట్టం అంతకంతకి పెరుగుతోంది. 3లక్షల 69వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చిచేరుతోంది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున 3లక్షల 67వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు.

భద్రాద్రి : కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరటంతో నీటి మట్టం అమాంతం పెరిగిపోయింది. వరద ఉధ ృతి ఎక్కువగా ఉండటంతో రెండు గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కర్నూలు : తుంగభద్రా జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. ఇన్‌ఫ్లో 69717క్యూసెక్కులు కాగా ప్రస్తుత నీటి మట్టం 77986 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 100టీఎంసీలు.

నిర్మల్ : కడెం ప్రాజెక్టుకు వరద ఉధ ృతి పెరగటంతో అధికారులు గోదావరి పరిసర ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టులోకి 9600 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. ప్రస్తుత నీటి మట్టం 698అడుగులు కాగా పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు.

# రైతులకు సకాలంలో విత్తనాలు అందించండి

## కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్

విజయనగరం: రైతులకు సకాలంలో విత్తనాలు అందించేందుకు అన్నిమండలాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందని అలాగే సూక్ష్మ పోషక ఎరువులు సత్వరమే పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ హరి జవహర్‌లాల్ ఆదేశించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ పనులు చేపట్టే గ్రామ పంచాయితీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, సి.సి.రోడ్లు, ఎన్టీఆర్ జలసిరి క్రింద బోరు బావులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఫీడర్ ఛానల్స్, కాలువ మరామ్మత్తులు, ట్యాంకులు సామర్థ్యం పెంపు తదితర పనులు డ్వామా, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి పని చేయాలని తద్వారా జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి ఉపయోగ పడతాయని తెలిపారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసే దిశగా అధికారులు పని చేయాలని తెలిపారు. ఏఇలు వద్ద పెండింగ్ ఉన్న గృహ నిర్మాణాలు డిఇలు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేసి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చూడాలన్నారు. మనం-వనం క్రింద అన్ని గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటేందుకు మండలవారీగా, నియోజక వర్గాల వారీగా ఏ మొక్కలు అందుబాటులో వచ్చాయో వివరాలు మండల అధికారలకు పంపించడం జరిగిందని, నర్సరీల్లో తమకు అవసరమైన మొక్కలను తీసుకు వెళ్ళవచ్చని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించి మురుగుకాల్వలు శుభ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీసేవ, మీ కోసంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కొన్ని గ్రామాల్లో చాలా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జెసి. వెంకట రమణారెడ్డి, జె.సి.-2 సీతారామారావు డిఆర్‌ఓ వెంకటరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతులకోసం రాజకీయ పోరాటానికి సిద్ధం

## అఖిలపక్ష నిర్ణయం



సదస్సులో మాట్లాడుతున్న భీశెట్టి భాబ్జీ

విజయనగరం: అంతర్జాతీయ వినానాశ్రయం పేరుతో మూడేళ్ళుగా రైతులను, కౌలుదారులను ఆర్థికంగా కృంగదీసిన సర్కార్‌పై రాజకీయ పోరాటానికి సిద్ధమౌతామని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ హెచ్చరించారు. సోమవారం పార్టీ జిల్లా కార్యయలయంలో అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురంలో 5311 ఎకరాల భూమిని సేకరించి, తనకు పరిపోయిన 2,688 భూమిని మాత్రమే తీసుకుని మిగిలిన వారిని ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. జిల్లాలో విమా నాశ్రమానికి భూములిచ్చిన రైతులు కుదేలైనా ఏ ఎమ్మెల్యే గానీ, ఇతర ప్రజాప్రతినిధులు కానీ స్పందించడం లేదని విమర్శించారు. గూడెపు వలస, కంచేరు, కవులవాడ, వాడ, ఏ.రావివలస, సవరవిల్లి, రావాడ, దల్లిపేట, కంచేరుపాలెం, ముంజేరు గ్రామ రైతులు రోడ్డునపడ్డారని ఇప్పటికైనా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని లేని పక్షంలో రాజకీయపోరాటం ఏస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వైయస్&ఆర్ పారీ్టీ నాయకులు రొంగలి పోతన్న, సిపిఎం.నాయకులు రెడ్డి శంకర్రావు, సిపిఐ నాయకులు బుగత అశోక్, జనసేన ప్రతినిధి త్యాడ రామకృష్ణ, బిఎస్పీ ఆర్డీ శివప్రసాద్, కాంగ్రెస్ నాయకులు భానుమూర్తి, ప్రజా సంఘాల ప్రతినిధులు బోడి ఆది నారాయణ, కామేశ్వరరావు, రామారావు, పాండ్రంకి సత్యనారాయణ, నాగభూషణం, నాయుడు, రాజారావు, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వ పుస్తకాలు

# పంపిణీ చేసిన సీతారాం



అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులకు పార్టీ సభ్యత్వ పుస్తకాలను పార్టీ నియోజక వర్గ నాయకులు కొణతాల సీతారాం స్థానిక జనసేన కార్యాలయంలో పంపిణీ చేసారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సభ్యులను అధిక సంఖ్యలో చేర్చుకునేలా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి శ్రీను, ఎస్. హరీష్, డి. ఈశ్వర్ ఎవి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# వరహావతారంలో జగన్నాథుడు



అనకాపల్లి : పట్టణంలోని ఇంద్రజ్యుమన హాలులో జగన్నాధుడు సోమవారం వరహావతారంలో దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి, పెద్ద ఎత్తున భక్తులు ఉదయం నుండి ఆలయానికి విచ్చేయడం కనిపించింది. వేద పండితులు మంత్రోశ్చరణ మద్య, స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చైర్మన్ గోపాల్, ధర్మకర్తలు, చర్యలు తీసుకున్నారు.

# ఇక మీ-సేవలోనే సదరం

విజయనగరం: జిల్లాలో గల దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు (సదరం) మీ-సేవలో మాత్రమే జారీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.హరిజవహర్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు సుభతరంగా కంప్యూటర్ ఆధారిత దివ్యాంగుల ధృవీకరణ పత్రాలను జారీ విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ విధానం ఆగష్టు 3వ తేదీ నుండి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటలకు విజయనగరం జిల్లాలో మెడికల్ బోర్డ్ సౌకర్యం గల మహారాజ జిల్లా ఆసుపత్రి, విజయనగరం, పార్వతీపురం నందు సదరం సర్టిఫికెట్లు కొరకు వైద్యపరమైన ధృవీకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుండి సదరంకోసం దరఖాస్తులు మీ-సేవ కేంద్రాల్లో చేసుకోవాలని , దివ్యాంగులకు సులభతరంగా జారీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ సెర్ఫ్,ఐసిడిఎస్,సామాజిక న్యాయం, మీ-సేవ, ఎపి.ఆన్‌లైన్ తదితర శాఖల సమన్వయంతో కొత్త విధానం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# బ్రహ్మోస్ ప్రయోగం సూపర్ సక్సెస్..

సాంకేతిక సామర్థ్యాన్ని పరీక్షించేందుకే ఈ ప్రయోగం నిర్వహించారు. బ్రహ్మోస్ జీవనకాలం పది నుంచి పదిహేనేళ్లకు పెంచాలనేది డీఆర్డీఓ లక్ష్యంగా పెట్టుకుంది. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా విజయవంతంగా లక్ష్యాన్ని చేరుకునేలా దీన్ని రూపొందించారు. 200 నుంచి 300 కిలోల వరకు అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన బ్రహ్మోస్ క్షిపణి, 290 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సునాయాసంగా చేరుకోగలదు. దీనిలా సూపర్‌సోనిక్ వేగంతో తక్కువ కాలంలో లక్ష్యాలను తొందరగా చేరుకునే సామర్థ్యం ప్రపంచంలో మరే ఇతర క్షిపణులకు లేదు.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఈ పరీక్షను సోమవారం నిర్వహించారు. బలమైన ఈదురు గాలులు, సముద్రంలో అలలు దాదాపు 7 మీటర్లపైకి ఎగిసిపడుతోన్న సమయంలోనూ ఈ ప్రయోగం విజయవంతమైంది. అంతకు ముందు ఈ క్షిపణిని మే 21న పరీక్షించారు. తాజాగా దీనికి ప్రొపల్షన్ సిస్టమ్, గైడెన్స్ సిస్టమ్, ఏరోడైనమిక్ ఫీచర్ల లాంటి సరికొత్త సాంకేతికతలను జోడించారు. లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యాన్ని కూడా ప్రస్తుతం పెంచారు. అంతేకాదు బ్రహ్మోస్‌ను 10 మీటర్ల నుంచి 15 కిలోమీటర్ల ఎత్తు మధ్య ప్రయోగించవచ్చు. ఈ క్షిపణులు ఇప్పటికే ఆర్మీ, నేవీలో చేరాయి. త్వరలో వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానం సుఖోయ్ 30 ఎంకేఐకి అనుసంధానం చేయనున్నారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే గ్రామ దర్శిని

శ్రీకారం చుట్టింది. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, టిడిపి శ్రేణులు స్వయంగా గ్రామాలకు వెళ్లేలా సిఎం చంద్రబాబు గ్రామదర్శిని అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. వంద రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబు సోమవారం గుంటూరు జిల్లాలో ప్రారంభించారు.

### సరికొత్త కార్యక్రమం

గ్రామదర్శిని ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలపై గ్రామీణులకు అవగాహన కల్పించడమే కాకుండా, అధికార యంత్రాంగం పల్లెలకు తరలివచ్చే గ్రామదర్శిని కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. తెదేపా అధికారంలోకి వచ్చి 1500 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ గ్రామదర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ఏ విధమైన సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అధికారులే గ్రామాలకు తరలివెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా సీఎం చంద్రబాబు ఈ గ్రామదర్శిని కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కారం ప్రక్రియలో కేవలం అధికారులే కాకుండా స్థానిక టిడిపి శ్రేణులు సైతం పాలుపంచుకుంటాయి.

కేంద్రం సహకరించనందునే ప్రభుత్వం నుంచి బయటకు వచ్చాము... మనమేమీ వారికి బానిసలంకాదు... మనమూ వారికి టాక్సులు కడుతున్నాం... మన రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతాం... అన్ని రంగాల్లోనూ దేశంలో మనమే నెంబర్ ఒన్... రానున్న రోజుల్లో ప్రపంచంలోనే మనమే నెంబర్ వన్ అవుతాము... అని సిఎం చంద్రబాబు అన్నారు. గ్రామదర్శినిపై ప్రజల ఆశలు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గ్రామదర్శినిలో అధికారులు చురుగ్గా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కరించాలని సిఎం అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికను సిద్ధం చేసి వచ్చే జనవరిలో జరిగే జన్మభూమి గ్రామసభల్లో విజన్ డాక్యుమెంటును ప్రకటించాలన్నారు. గ్రామదర్శిని కార్యక్రమం అనుకున్న రీతిలో నిర్వహిస్తే ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పల్లెల్లోని సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్థులు ఆశిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నక్కాఆనంద బాబు, పుల్లారావు, దేవినేని ఉమా, ఎంపీ మాల్యాద్రి, ఎమ్మెల్యేలు జి.వి.ఆంజనేయులు, అనగాని సత్యప్రసాద్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ల

# ఏపీలో అవినీతి పాలన సాగుతోంది

రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై రాష్ట్రంలోని శాంతి భద్రతల అంశంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార పార్టీ ఆగడాలు మితిమీరి పోయాయి. భాజపా కార్యకర్తలపై దాడులు పెరిగాయి. ఎక్కడైనా పార్టీ వర్గాల మధ్య ఘర్షణ జరిగితే పోలీసులు అధికార పార్టీ నేతలను వదిలేసి ఇతర పార్టీల వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. భాజపా నేతలపై పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయి. నేను అనంతపురం పర్యటనకు వెళ్లినప్పుడు గెస్ట్ హౌస్‌పై దాడికి పాల్పడ్డారు. కావలిలో చెప్పుల దాడి జరిగింది. ఒంగోలులోనూ దాడికి యత్నించగా.. భాజపా కార్యకర్తలు అడ్డుకున్నారు. కానీ పోలీసులు మాత్రం భాజపా కార్యకర్తలపైనే కేసులు నమోదు చేశారు. భాజపా జతీయ అధ్యక్షుడు అమిత్ షా తిరుమల వచ్చినప్పుడు పథకం ప్రకారమే దాడికి పాల్పడ్డారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతిని నిలదీస్తున్నందుకే దాడులు చేస్తున్నారు. ప్రభుత్వం తీరును ఎవరు ప్రశ్నించినా వేధిస్తున్నారు. నా ఫోన్‌ను ట్యాపింగ్ చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇలాంటి అరాచక పాలన ముందెన్నడూ చూడలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై రాజ్‌నాథ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశాను అని తెలిపారు.

# మమత కోటలో సిండికేట్ రాజకీయాలు

అది తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. 'ఇక్కడి రాజకీయ సిండికేట్ పశ్చిమబెంగాల్ ఘన చరిత్ర, వారసత్వాన్ని దిగజారుస్తోంది. సిండికేట్ ఆమోదం లేకుండా ఏ పనీ జరగడం లేదు. బిజినెస్ చేయాలన్నా, ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా, చివరకు ధరలు కూడా సిండికేట్లే నిర్ణయిస్తున్నాయి. కాలేజీ అడ్మిషన్లు సైతం సిండికేట్ల జోక్యం లేకుండా జరగవు' అంటూ ఘాటు విమర్శలు చేశారు. 'వాళ్లు (రాష్ట్ర ప్రభుత్వం) మా, మాటి (భూమి, ప్రజలు) అంటుంటారు. అయితే వారి నిజస్వరూపం ఇదే' అని నిప్పులు చెరిగారు. ఇటీవల పంచాయితీ ఎన్నికల్లో చోటుచేసుకున్న హింసాకాండను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్యం లోపించిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. 'రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను చంపండం పాపం. మీ ప్రత్యర్థులను చంపండన్న సిండికేటే ఇక్కడ పని చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పంపే నిధులు కూడా ఈ సిండికేట్ అనుమతి లేకుండా వినియోగించరు. ఈ సిండికేట్‌ను సమూలంగా పెకిలించేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి రావాలి' అని మోదీ పిలుపునిచ్చారు. 'మీ పొరుగున ఉన్న త్రిపుర ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చారు. మీరకూ ధైర్యంగా గళం విప్పండి. మీ కలలు సాకారం కాకుండా అడ్డుపడుతున్న సిండికేట్‌ను ధైర్యంగా ఎదిరించండి' అని మోదీ ఉద్వేగంగా అన్నారు.

### భావోద్వేగానికి గురైన మోదీ...

ప్రధాని నరేంద్ర మోదీ చలించిపోయారు. తన ర్యాలీకి వచ్చి ప్రమాదవశాత్తూ టెంటు కూలి గాయపడిన వారిని స్వయంగా ఆసుపత్రికి వెళ్లి వారిని పేరుపేరునా పలకరించారు. ధైర్య వచనాలు చెప్పారు. మీకేమీ కాదంటూ అనునయించారు. వారు చేతులను, తలను ఆప్యాయంగా తడుముతూ వారికి ధైర్యం చెప్పారు.

పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన కిసాన్ ర్యాలీలో మోదీ ప్రసంగిస్తుండగా, అక్కడి టెంటులోని కొంత భాగం కూలి 20 మందికి పైగా గాయపడ్డారు. టెంట్‌కు సపోర్టింగ్‌గా ఉన్న పోల్స్ ఎక్కి కొందరు మోదీని చూసేందుకు పోటీపడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. వైదికపై ఉన్న మోదీ వెంటనే ఇది గ్రహించి...అక్కడ్నించే వారికి జాగ్రత్తలు చెప్పారు. పోల్స్ ఎక్కిన వాళ్లు మెల్లగా కిందకు దిగాలని, ఎవరూ పరుగులు తీయవద్దని చెబుతూనే.... తన ఎస్‌పీజీ సిబ్బందిని సైతం వెంటనే వెళ్లి వాళ్లను ఆదుకోవాలంటూ పురమాయించారు. క్షతగాత్రులను అంబెలెన్స్‌లలో తరలించగా, ఎస్‌పీజీ సిబ్బంది సైతం వారిని అనుసరించారు. అనంతరం మోదీ, క్షతగాత్రులు చేరిన ఆసుపత్రికి వెళ్లి స్వయంగా పలకరించారు. తగిన వైద్యసహాయం అందించాలని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచనలు చేశారు. క్షతగాత్రుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఒక్కొక్కరినీ మోదీ పలకరించి...ధైర్య వచనాలు చెప్పారు. ఈ సమయంలో మోదీ ఒకింత భావోద్వేగానికి కూడా లోనయ్యారు.

# మాదక ద్రవ్యాల నివారణకు విధివిధానాలు రూపొందించాలి

దర్యాప్తు జరిపించాలంటూ దర్శక, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా డ్రగ్స్ నియంత్రణకు ఉద్దేశించిన విధివిధానాలు రూపొందించేందుకు నాలుగు నెలలు సమయం ఇవ్వాలని కేంద్ర కోరగా.. ఇప్పటి వరకు విధివిధానాలు ఎందుకు రూపొందించలేదంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆగష్టు 31లోపు విధివిధానాలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. అయితే, ఇందుకోసం కనీసం రెండు నెలల గడువు ఇవ్వాలని కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటరల్ జనరల్ మణిందర్ సింగ్ ధర్మాసనాన్ని కోరారు. విధివిధానాలు రూపొందించడంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సహకారం ఆలస్యం అవుతుందని సుప్రీంకోర్టుకు నివేదించారు. ఈ విషయంలో అన్ని రాష్ట్రాలకు నోటీసులు జారీచేయాలని పిటీషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్ కుమార్ కోరగా.. విధివిధానాలు రూపొందించిన తరువాత, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసే విషయం గురించి ఆలోచిద్దామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో తదుపరి విచారణ సెప్టెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

### డ్రగ్స్ కేసు విచారణ సెప్టెంబర్ 10కి వాయిదా

డ్రగ్స్ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సోమవారం డ్రగ్స్ కేసు పిటీషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. డ్రగ్స్ నియంత్రణపై కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పిటిషన్ వేయగా దీనిపై కేంద్రాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే వివరణ ఇచ్చేందుకు నాలుగు నెలల సమయం కావాల్సిందిగా సుప్రీంను కేంద్రం కోరింది. కాగా గడువు ఇచ్చేందుకు నిరాకరించిన కోర్టు డ్రగ్స్ నియంత్రణకు రెండు నెలల్లో జాతీయ విధానం రూపొందించాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది.

# సొంత గనులు కేటాయించాలి



విశాఖపట్నంః మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ విస్తరణ పూర్తి చేసుకుని నేడు 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరుకుంటున్నది, కొన్ని వేలమందికి ఉపాధి కల్పించే దిశగా నేడు విశాఖ ఉక్కు ముందుకు సాగుతోంది కానీ, సొంత గనులు లేక విశాఖ స్టీల్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని స్టీల్ సిఐటియు నాయకుడు రవి కుమార్ పేర్కొన్నారు. సొంత గనులు ఉన్నట్లయితే ఉభయ ప్రభుత్వాలకు మరింత ఆర్థిక ప్రయోజనం సమకూర్చకలిగి ఉండేది. ఈ అంశాన్ని పలుమార్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం నుండి ఇద్దరు మంత్రులుగా పనిచేసినప్పటికీ వియస్‌పికి గనులు కేటాయించలేదు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన గనుల పాలసీ ప్రకారం మన రాష్ట్రంలో ఉన్న ప్రకాశం జిల్లాకు చెందిన కొణిజేడు, మర్లపాడు, వెంపర్ల ఏరియాలలో ఉన్న గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించినట్లయితే ప్లాంట్‌కు ఆర్థికంగా వెసులుబాటు కలగడమే కాకుండా నష్టాలను అధిగమించి లాభాలను ఆర్జించవచ్చునని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిటు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. నరసింగరావు, స్టీల్ గౌరవాధ్యక్షుడు బి. గంగారావు, స్టీల్ నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం (ప్రజావాణి 348 దరఖాస్తులు)



విశాఖపట్నం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. మీ కోసం కార్యక్రమానికి సోమవారం 348 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ -2 డా.సిరి, డిఆర్‌ఓ చంద్రశేఖరరెడ్డి, యస్‌డిసి సత్తిబాబు మీ కోసం కార్యక్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్ల మంజూరు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్‌కు 17 ఫోన్ కాల్స్ :** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 17 ఫోన్ కాల్స్ ద్వారా బాధితులు తమ వినతులను విన్నవించు కున్నారు. జెసి-2 డా.సిరి ఫోన్‌కాల్స్ స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

జాయింట్ కలెక్టర్ డా.సిరి మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులను ఫోను ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పేదల రుణం తీర్చుకుంటాం

- 15,679 మంది పేదలకు గృహ పట్టాల పంపిణీ
- ఇల్లు కేటాయించకముందే తొందరపడి డీడీలు చెల్లించొద్దు
- దక్షిణ టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



విశాఖపట్నంః టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిలువ నీడలేని, గృహాలు లేని పేదలెవ్వరూ ఉండకూడదనే ఆధ్వర్యంలో టీడీపీ పక్కా పేదలందరికీ గృహ కల్పన ఉండాలనే ముఖ్యోద్దేశంతో నిరుపేదలందరికీ పక్కా గృహాలు కల్పిస్తోంది.

దక్షిణ నియోజకవర్గంలో గృహాలు లేని పేదలు 30 వేలు మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని, అందులో 15,679 మందిని అర్హులుగా గుర్తించి దశల వారీగా గృహాలు మంజూరు చేయడమైందని త్వరలోనే వీటిని అందిస్తామని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గృహాలు మంజూరైన పేదలందరూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను కలిసి అతనికి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఇన్నాళ్లూ తామెన్నో కష్టాలు పడ్డామని, ఇపుడు తెలుగుదేశం హయాంలో మాకు ఇళ్లు కల్పించినందుకు తమకెంతో ఆనందంగా ఉందని అంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని సత్కరించారు. మధురవాడ, చినముషిడివాడ గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాలలో గృహాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి పేదలకు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు, ఇల్లు మంజూరు కాకుండా ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని మరీ మరీ చెప్పారు. ఎవరు డబ్బులు అడిగినా తనకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు కేదారి లక్ష్మి, దొడ్డి లక్ష్మి, పోలవరపు వరలక్ష్మి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కుమార్‌కు
# గీతం పిహెచ్‌డి అవార్డు



విశాఖపట్నం : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ ద్వారా 'చిన్న వ్యాపారవేత్తల రుణాలు -చెల్లింపు ధోరణులపై పరిశోధన జరిపినందుకు గాను ఆర్.పవన్ కుమార్ రాజుకు గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం పిహెచ్‌డి అవార్డును ప్రకటించింది.గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా మార్గదర్శకంలో ఆర్.పవన్ కుమార్ రాజు ఈ పరిశోధన జరిపారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**మిల్క్ స్టాల్ ఏర్పాటు**

టెండరు ప్రకటన నెం. WCF/1/Milk Stall/ABC/DEF/Notification/WAT, తేదీ. 06.07.2018

**వ.నెం.: M-1** స్టేషన్: **విశాఖపట్నం,** స్టేషన్ క్యాటగిరి: A-1, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 1, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 11,29,205/-.

**వ.నెం.: M-2** స్టేషన్: **విశాఖపట్నం,** స్టేషన్ క్యాటగిరి: A-1, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 2/3, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 8,40,000/-.

**వ.నెం.: M-3** స్టేషన్: **విశాఖపట్నం,** స్టేషన్ క్యాటగిరి: A-1, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 4/5, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 8,40,000/-.

**వ.నెం.: M-4** స్టేషన్: **విశాఖపట్నం,** స్టేషన్ క్యాటగిరి: A-1, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 8, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 8,40,000/-.

**వ.నెం.: M-5** స్టేషన్: **విజయనగరం,** స్టేషన్ క్యాటగిరి: A, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 1, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 6,50,000/-.

**వ.నెం.: M-6** స్టేషన్: **విజయనగరం,** స్టేషన్ క్యాటగిరి: A, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం.4/5,అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 6,25,000/-.

**వ.నెం.: M-7** స్టేషన్: **రాయగడ,** స్టేషన్ క్యాటగిరి: A, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 2/3, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 5,00,000/-.

**వ.నెం.: M-8** స్టేషన్: **దువ్వాడ,** స్టేషన్ క్యాటగిరి: B, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 1, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 4,00,000/-.

**వ.నెం.: M-9** స్టేషన్: **సింహాచలం,** స్టేషన్ క్యాటగిరి: B, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం. 2, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 3,00,000/-.

**వ.నెం.: M-10** స్టేషన్: **పార్వతీపురం,** స్టేషన్ క్యాటగిరి: D, క్యాటరింగ్ యూనిట్స్: మిల్క్ స్టాల్, ప్లాట్ ఫారం నెం.3, అయిదు సంవత్సరాలకు రిజర్వు ధర (₹): 1,10,000/-.

**బయానా:** (వ.నెం. M-1 నుంచి M-7 వరకు) ₹ 1,00,000/- & (వ.నెం. M-8 నుంచి M-10 వరకు) ₹ 25,000/- **టెండరు ఫారం ఖరీదు:** (అన్ని టెండర్లకు) ₹ 2,950/- (జిఎస్‌టి కలుపుకుని)

డౌన్ లోడ్ ప్రారంభ తేదీ & సమయం: **19.07.2018**న **1000** గంటల నుండి, డౌన్ లోడ్ ముగింపు తేదీ & సమయం: **20.08.2018**న **1200** గంటల వరకు, దాఖలు చేయు ప్రారంభ తేదీ & సమయం: **20.08.2018**న **1200** గంటల నుండి. టెండరు దాఖలు చేయు ముగింపు తేదీ & సమయం: **20.08.2018**న **1500** గంటల వరకు, **టెండరు తెరచు తేదీ & సమయం: 20.08.2018**న **1530** గంటలకు.

బిడ్ డాక్యుమెంట్లు లభించు చోటు: డివిజనల్ రైల్వే మేనేజర్ (కమర్షియల్) వారి కార్యాలయం, వాల్తేరు డివిజన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఆంధ్ర ప్రదేశ్, విశాఖపట్నం-530004. బిడ్ డాక్యుమెంట్లు వెబ్‌సైట్: **www.eastcoastrail.indianrailways.gov.in** నందు కూడ లభిస్తాయి.

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, వాల్తేరు

PR-229/J/18-19



**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**అద్దెకు వాహనములు**

1) ఇ-టెండరు ప్రకటన నెం.: eT-RPF-WAT-02-2018, తేదీ. 11.07.2018

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో హెడ్ క్వార్టర్ వద్ద రైల్వే రక్షక దళం అధికారులు, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్/ASC మరియు సిబ్బంది రవాణా కొరకు మోటారు వాహనము అద్దెకిచ్చుట మరియు నడుపుట అనగా నాన్-ఎసి టాటా సుమో లేదా అటువంటిది (24 గంటలు లభించుటపైన) మూడు సంవత్సరాల కాలంనకు ఇంధనం ఖర్చు, లుబ్రికెంట్ (రీయంబర్స్మెంట్), మేజర్, మైనరు, రిపేర్లు, డ్రైవరు జీతం, టోల్‌పన్ను, అన్ని ఇతర పన్నులు పూర్తిగా చెల్లించుట, అపరేషన్ మరియు మెయింటెనెన్స్‌తో సహా కలుపుకుని అద్దెకు సరఫరా చేయుట.

**పని విలువ సుమారు:** ₹ **12,72,332.00**, బయానా: ₹ **25,450.00**, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ **2,360/-**. పని పూర్తి చేయు కాలం: 36 (ముప్పైఆరు) నెలలు.

2) ఇ-టెండరు ప్రకటన నెం.: eT-RPF-WAT-03-2018, తేదీ. 11.07.2018

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో దంతేవారా వద్ద రైల్వే రక్షక దళం పోస్ట్ యొక్క రైల్వే రక్షక దళం అధికారులు మరియు సిబ్బంది రవాణా కొరకు మోటారు వాహనము అద్దెకిచ్చుట మరియు నడుపుట అనగా నాన్-ఎసి టాటా సుమో లేదా అటువంటిది (24 గంటలు లభించుటపైన) మూడు సంవత్సరాల కాలంనకు ఇంధనం ఖర్చు, లుబ్రికెంట్ (రీయంబర్స్మెంట్), మేజర్, మైనరు, రిపేర్లు, డ్రైవరు జీతం, టోల్‌పన్ను, అన్ని ఇతర పన్నులు పూర్తిగా చెల్లించుట, అపరేషన్ మరియు మెయింటెనెన్స్‌తో సహా కలుపుకుని అద్దెకు సరఫరా చేయుట.

**పని విలువ సుమారు:** ₹ **11,51,499.00**, బయానా: ₹ **23,030.00**, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ **2,360/-**. పని పూర్తి చేయు కాలం: 36 (ముప్పైఆరు) నెలలు.

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: **14.08.2018**న **1500** గంటలు (రెండు టెండర్లకు).

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు **http://www.ireps.gov.in** వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

సీనియర్ డివిజనల్ సెక్యూరిటి కమీషనర్, RPF, వాల్తేరు

PR-238/J/18-19


# పరిశోధన ప్రాజెక్టులను సాధించాలి

## వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు



వీసీ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఆచార్య విశ్వనాథం తదితరులు

ఆంధ్రా యూనివర్శిటీ : ఆచార్యులు పరిశోధన ప్రాజెక్టులను సాధించే దిశగా పనిచేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న 'రీసెర్చ్ మెథడాలజీ' స్వల్పకాలిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.

అనంతరం మాట్లా డుతూ విభిన్న శాఖలు ఆర్థిక సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నాయని, ఆచా ర్యులు నిర్దిష్ట ప్రణాళికతో దరఖాస్తు చేసి పరి శోధన ప్రాజెక్టులను పొందాలన్నారు. నాణ్యమైన పరిశోధనలకు వర్సిటీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్‌లో ముందుడటానికి ఇవన్నీ దోహద పడ్డాయన్నారు. అధ్యాపకులు కాలానుగుణంగా తమ బోధన నైపుణ్యాలను మెరుగు పరచు కోవాలని సూచించారు.ఒక క్రమపద్ధతిలో అధ్యాపకులు తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావును ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ఆచార్య పి.విశ్వనాథం, డాక్టర్ ఎన్.ఏ.డి పాల్, డాక్టర్ చల్లా రామక్రిష్ణ, డాక్టర్ పి.ప్రేమానందం, డాక్టర్ ధర్మాన రామారావు, డాక్టర్ వి.సిద్దయ్య, డాక్టర్ వి.శ్రీమన్నారాయణ మూర్తి, డాక్టర్ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ సేవలకు
# 1000 మంది గీతం విద్యార్థులు



విశాఖపట్నం : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్)లో వలంటీర్లుగా సేవలందించడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభం అయింది. మొదటి రోజున ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో 1000 మంది విద్యార్థులు పేర్లను ఎన్.ఎస్.ఎస్ విభాగం అన్‌లైన్ విధానంలో నమోదు చేసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు, ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.వి.స్వామి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

గీతం ఎన్.ఎస్. ఎస్.ప్రతిభ జాతీయ స్థాయిలో మారు మోగుతోందని సరికొత్త కార్య క్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థులు సేవా నిరతిని చాటు తున్నారని వారు పేర్కొన్నారు. ప్రాంగణ నియా మకాలలో ఎన్.ఎస్.ఎస్ సేవ లకు ప్రాధాన్యత నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇఫిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.వి.వై జయశ్రీ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు మహ్మద్ కె.ఎమ్.చిస్టి, డి.ఎస్.వి.శంకర్ పాల్గొన్నారు.

# ప్రేమ విఫలం కవడంతో యువతి అత్మ హత్య ..

కంచరపాలెం : ప్రేమ విఫలం కవడంతో ఒక యువతి ఉరి వేసుకొని అత్మ హత్య కు పాల్పడిన ఘటన జీవీఎంసీ 40 వ వార్డు పరిది హుస్సేన్ నగర్ వద్ద సోమవారం మద్యాహ్నం చోటు చూసుకుంది . అత్మ హత్య సంబందించి పోలీసు లు స్థానికుల తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ కు చెందిన గరికిన చంద్రిక తనకుమార్తె గరికిన రమణి ( 19 )తో ఉపాది రిత్యా గత కొంత కాలంగ ఆర్ .అండ్ .బి కూడలి వద్ద నివాసముంటున్నారు . ఇదిలా ఉండగా ఎనిమిది నెలల క్రితం 40 వ వార్డు పరిది హుస్సేన్ నగర్ వద్ద ఒక ఇంట్లో అద్దెకు వుంటున్నారు . కాగ మృతురాలు ఎన్ .ఏడీ కూడలి లో ఒక బైక్ కన్సల్టెన్స్ లో విదులు నిర్వహిస్తుంది. ఇదిలా ఉండగ వ్యక్తి గత పని నిమిత్తం బయటకి వెళ్ళి తిరిగి ఇంటికొచ్చి న తల్లి చంద్రిక తలుపు కొట్టిన ఎంతకి తన కుమార్తే తలపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలపు పక్కాగా చూసేసరికి తనకుమార్తే ఉరి వేసుకొని ఉండటంతో పెద్ద గా కేకలు వేసింది దింతో అక్కడికి చేరుకున్న స్థానికులు ఎయిర్ పోర్ట్ జోన్ పోలీసు లకు సమాచారం అందించారు. అయితే మృతురాలు గత కొంతకాలంగా వరసకు బావ అయిన దేవరపల్లి రమణ చిన్న ( 23 ) ఒకే ఇంట్లో నివసించేవారు . ఈ మధ్యకాలంలో రమణ తన బావ మృతి చెందడంతో కుటుంబ పరిస్థితి నిమిత్తం గోపాలపట్నం వద్ద అతడి కుటుంబ సభ్యుల వద్దే నివాసముంటున్నాడు . అయితే రమణ కు వారం రోజులనుండి ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించక పావడంతో మనస్థాపానికి గురై నేను చనిపోతే నీకు సంతోషంగా ఉంటుంది నా వలన నీ సంతోషానికి ఎటువంటి ఇబ్బంధి వుండకూడదని భవిస్తూ చచ్చి పోతున్నాను చిన్న అని సూసైడ్ లెటర్ రాసి అత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసు క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరించారు ఎయిర్ పోర్ట్ జోన్ సి.ఐ మళ్ల శేషు ఎస్ .ఐ నర్సింహా రాజు చేరుకుని స్థానికుల వద్ద వివరాలు సేకరించారు. మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ కు తరలించి సూసైడ్ లేటర్ ఆధారంగా పోలీసు లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఎస్‌ఇఆర్/17-18/286**

1. ఎన్‌డి(వి) వద్ద వైయస్ విభాగపు 400 బార్ మొబైల్ హెచ్‌పి ఎయిర్ కంప్రెసర్ల యొక్క ఆపరేషన్ కొరకు సపోర్ట్ సర్వీసులు అద్దెకు తీసుకునేందుకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 26,350/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. **ప్రి-బిడ్డు సమావేశం:** ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 23 జూలై 18/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.

4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 11 ఆగస్టు 18 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0057/1819** **డిజిఎమ్ (ఆర్‌పి)**



**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఆర్‌సి/17-18/235**

1. ఎన్‌డి(వి) వద్ద ఎమ్‌డిఎస్ డిపార్ట్‌మెంట్ కొరకు వరుణ్ డాక్ సూర్య డాక్, మత్స్య డాక్, స్లిప్‌వే యొక్క ప్రి-హాలింగ్ ఏరియా మరియు పంపుహౌస్ యొక్క పంపులు డిస్టిలేషన్ కొరకు రేటు కాంట్రాక్టుపై ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 4,74,000/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. **ప్రి-బిడ్డు సమావేశం:** ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 23 జూలై 18/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.

4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 11 ఆగస్టు 18 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0056/1819** **ఎజిఎమ్ (ఆర్‌పి)**


# ఆహార భద్రత - ప్రతి పౌరుని హక్కు పోస్టర్ ఆవిష్కరణ



విశాఖపట్నం : పౌర సరఫరాలశాఖకు సంబంధించి ఆహార భద్రత మరియు పౌష్టికా హారం ప్రభుత్వ లక్ష్యం, ఆహార భద్రత - ప్రతి పౌరుని హక్కు పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా చంద్రన్న మాల్స్, చౌక ధరల దుకాణాలలో కార్డుదారుడు తాను తీసుకుంటున్న నిత్యావసర సరుకులకు సంబం ధించి రశీదు తీసుకోవడం, తూకం సరిచూసుకోవాలన్నారు. ఇ-పాస్ యంత్రం యొక్క సూచనల ప్రకారం నడుచుకోవాలని, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించాలన్నారు. రేషన్‌షాపు డీలరు కార్డుదారుని మర్యాద పూర్వకంగా ఆహ్వానించి సరుకులు అందిం చాలని, ఇ-పాస్, ఐరిస్ యంత్రాలను సక్రమంగా వినియోగించడం, సరుకులను సక్రమంగా తూనికవేయాలన్నారు.డీలరు అనుచితంగా ప్రవర్తించిన యెడల ముఖ్యమంత్రి పరిష్కార వేదిక ప్రజలే ముందు 1100కు గాని, జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 1800-11-4000లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, జెసి-2 డా.సిరి, డిఆర్‌ఓ చంద్ర శేఖర రెడ్డి, సత్తిబాబు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఎల్‌బి.వెంకటరావు, కంజ్యూమర్ ఆర్గనైజేషన్ మెంబర్ కాంగ్రేగుల వెంకటరమణ, సభ్యులు, ట్రైనీ కలెక్టర్ దినేష్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## విద్యార్థినులు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి


బాలికలతో మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

నాతవరం : అపరిచిత వ్యక్తులపై బాలికలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నాతవరం ఎస్సై వి. సత్యనారాయణ చెప్పారు. సోమవారం మర్రిపాలెం కేజీబివిలో పాఠశాలలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలు ఎక్కడికి వెళ్లినా, దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎవరినైనా సహాయం తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కస్తూర్భా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## హుండీలో డబ్బులు అపహరించిన దుండగలు

కంచరపాలెం : జీవీఎంసీ 40వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతంలో నున్న హజ్రత్ గౌస్ పాక్ దర్గా షరీఫ్ వద్ద కోలని మస్జిద్ కమిటీ ఏర్పాటు చేసిన హుండీని సోమవారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగల గొట్టి అందులో ఉన్న సుమారు 30 వేల నగదును ఎత్తుకెళ్లారని స్థానికులు అంటున్నారు. హుండీ పగలగొడుతూ వుండటాన్ని గమనించిన స్థానిక మహిళలు వారిని పట్టుకునే ప్రయత్నం చేసేలోపు అక్కడినుండి దుండగలు పరుగు తీశారు.

**కోలనీ పరిసర ప్రాంతల్లో నిత్యం దింగతనాలే**

అయితే ఇటివలే కాలంలో తమ గ్రామంలో దొంగతనాలు ఎక్కువయ్యాయని డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ గ్రామ కార్యదర్శి అన్సర్ వలి అంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అపరిచిత వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై అనుమానస్పద స్థితిలో సంచరిస్తున్నారని రహదారిపై నిలిపి ఉంచిన వాహనాల టైర్లు, బ్యాటరీలు దొంగిలిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన కనీసం తమ ఫిర్యాదులను స్వీకరించటం లేదని వారు ఆరోపిస్తున్నారు.

## సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి



గాజువాక : జీవీయంసీ 50వ వార్డు భానోజీతోట గ్రామంలో ప్రజా నివాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే ఆపేయాలని జనసేననేత తిప్పల రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు సోమవారం జోన్-5 కార్యాలయంలో జోన్-5జెడ్సీ ఛక్రధరరావును కలిసి సమస్యలను వివరించి, వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సంధర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం వలన స్థానిక ప్రజలు అనేక ఆరోగ్యసమస్యల బారిన పడతారని అన్నారు. అందువలన దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జెడ్సీకి వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిల్లాని నాయుడు, వెంకట్, శ్రీకాంత్, శేషు, వంశీ, ఆనంద్, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మావోలకు వ్యతిరేకంగా పోస్టర్లు

కొయ్యూరు : మావోయిస్టులకు వ్యతిరేకంగా పలు గ్రామాల్లో పోస్టర్లు వెలిశాయి. గిరిజనులను చంపి ఇన్‌ఫార్మర్లుగా ముద్ర వేస్తారా.. అంటూ పోస్టర్లు వేశారు. గిరిజనులారా మావోయిస్టులకు సహాయపడితే వారే తిరిగి మిమ్మల్ని చంపుతారని ఆలోచించాలంటూ ఆ పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ అంశం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## మిశ్రమ పంటలతో అధిక లాభాలు

రోలుగుంట : మండల రైతాంగం మిశ్రమ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. శరభవరం, గదబపాలెం, వడ్డిప, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, కొమరవోలు తదితర గ్రామాల్లో నువ్వు, కంది సుమారు 400 ఎకరాల పైబడిన విస్తీర్ణంలో సాగు చేపట్టారు. అలాగే బుచ్చింపేట, నిండుగొండ, ఎన్.కొత్తూరు, రొంగలపాలెం, కాముడుపాలెం, గుర్రంపేట, కంచుగుమ్మల తదితర గ్రామాల్లో పెసర, కంది సుమారు 550 ఎకరాల్లో సాగు చేపట్టారు. గుండుబాడు, బల్జిపాలెం, కసిరెడ్డిపాలెం, గుండుపాడు, జగ్గంపేట, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో పెసర, కంది, బబ్బర, జీడి తదితర పంటలను సుమారు 600 ఎకరాల పైబడిన విస్తీర్ణంలో సాగు చేపట్టారు.

## సన్ స్కూల్‌లో రక్తదాన శిబిరం



భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ఆధ్వర్యంలో,లయన్స్ క్లబ్ భీమిలి గ్రేటర్ సహకారంతో 16వ రక్తదాన శిబిరం స్థానిక సన్ స్కూల్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబరం లో సుమారు 150 మంది రక్తదానం చేసారని లైన్స్ క్లబ్ ఆఫ్ భీమిలి గ్రేటర్ ప్రేసిడేంట్ లయన్ కె.రామకృష్ణ తెలిపారు. అనంతరం లైన్స్ క్లబ్ టాలెంట్ టెస్ట్ లో విజేతలకు సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాస రావు బహుమతులు నగదు అందజేసారు. ఈ కార్యక్రమం లో లైన్స్ క్లబ్ సభ్యులు లయన్ పద్మావతినాయుడు,బమ్మిడి ఉమ, సి.హెచ్ గౌరినాయిడు, వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ. శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## బాలరాజుపై అనకాపల్లి నేతలు ఫిర్యాదు



అనకాపల్లి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పసుపులేటి బాలరాజుపై అనకాపల్లికి చెందిన ఆపార్టీ నాయకులు ఫిర్యాదు చేసారు. సోమవారం ఉత్తరాంధ్ర పర్యటనకు విచ్చేసిన, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఉమెన్ చాంధిని కలిసి ఫిర్యాదు అందజేసారు. సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్సి కోరిబిల్లిపరి యువజన కాంగ్రెస్ నాయకులు కిషోర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయుకుల తదిరుల గవర్నర్ బంగ్లాలో ఉమెన్‌చాందిని కలిసి వినతిపత్రం అందజేసారు. పార్టీలో గ్రూపులను బాలరాజు పెంచి పోషిస్తున్నారు. అనకాపల్లిలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి పార్టీ ఉనికిడి ప్రజలలోకి తీసుకువెళ్లినా తనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోవాడం దురదృష్ట కరమన్నారు. అసలు ఎందదుకు సస్పెండ్ చేసారో చెప్పలేదన్నారు. డీసీసీ అధ్యక్షలు రఘువీరారెడ్డికి విషయం తెలిపినా చర్యలు తీసుకోకపోడవం దురదృష్టకరమనానరు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న మాకు న్యాయం చేయాలని, కోరారు.

## ఫిర్యాదులపై తక్షణమే పరిష్కారం : ఎస్పీ పాలరాజ్



విజయనగరం: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు గైకొనాలని జిల్లా ఎస్పీ జి.పాలరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు తన కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలు మూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు 25 ఫిర్యాదులను అందిం చారు. వాటిని పరిశీలించిన ఎస్పీ వెంటనే సంబంధిత అధికారులకు వాటిని పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అట్టాడ వెంకటరమణ, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ వై.వి.శేషు, ఎస్.ఐ డి.రవికుమార్, పిఆర్‌ఓ కోటేశ్వరావు పాల్గొన్నారు.

# పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని

## సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




నర్సీపట్నం : అర్హులైన వారందరికీ పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, సాగు భూములకు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, అటవీ హక్కుల చట్ట ప్రకారం సాగులో ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం నర్సీపట్నంలో సిపిఐ నాయకులు భారీ ధర్నా చేశారు. ముందుగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుండి శ్రీకన్య జంక్షన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ అర్హులందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదల స్వాదీనంలో ఉన్న ఇళ్ల స్థలాలకు, సాగు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని ఇంటి స్థలం, పక్కా ఇల్లు అర్జీలన్ని వెంటనే పరిష్కరించాలన్నారు. స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులు చిత్తశుద్ధిగా అమలు చేయాలని చెప్పారు. జన్మభూమి కమిటీలు రద్దు చేయాలని, ప్రభుత్వం ఆమోదించిన కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను బేషర తుగా అమలు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో విశ్వేశ్వరరావు, డిఎఫ్ఒ శేఖర్‌బాబులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా వ్యవ సాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శివలంక కొండలరావు, పట్టణ కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, కోటవురట్ల, గొలుగొండ, మాకవర పాలెం మండల కార్యదర్శులు ఎస్.నాగేశ్వరరావు, నల్లబెల్లి శ్రీను, తాతబ్బాయి, సమితి సభ్యులు శ్రీనివాసచౌదరి, అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను, పోలియోచుక్కలను తప్పనిసరిగా వేయాలి : కలెక్టర్



విశాఖపట్నం : వ్యాధులు దరిచేరకుండా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మిషన్ ఇంద్రధనుష్ క్రింద చిన్నారులకు వ్యాధినిరోధక పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం గ్రామ స్వరాజ్య అభియాన్-మిషన్ ఇంద్రధనుష్ స్పెషల్ కేంపైలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, గర్భిణీలకు వ్యాధి నిరోధక టీకాలను పోలియో చుక్కలను ఈ నెల 16 నుండి నెలాఖరు వరకు పట్టణ, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి చుక్కలను వేయాలన్నారు. 830మంది ఎఎన్‌యంలు, 5155మంది ఆశా వర్కర్లు, 4952 మంది అంగన్వాడీ వర్కర్లు, 379మంది సూపర్ వైజర్లు పని చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, జెసి-2 డా.సిరి, డిఆర్ఒ చంద్రశేఖరరెడ్డి, యస్‌డిసి సత్తిబాబు, ట్రైనీ కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ పట్టణ పగ్గాలు అందుకున్న డాక్టర్‌కి అభినందనలు



అనకాపల్లి : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు కళ్యాణి నర్సింగ్ హెూమ్ అధినేత డాక్టర్ కెకెవి నారాయణరావును తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అబిమానులు, నాయకులు, అభినందనలతో ముంచెత్తారు. పూడిమడక రోడ్‌లో గల కళ్యాణి నర్సింగ్ హెూమ్ మేడ మీద డాక్టర్ నివాసంలో అభినందన సభ జరిగింది. పట్టణ తెలుగుదేశం పార్టీఅధ్యక్షులుగా నియమించబడ్డ డాక్టర్ నారాయణరావును వివిధ ప్రాంతాల నుండి అభిమానులు విచ్చేసి పూలమాలలతో ముంచెత్తారు. ఈసందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తానని పెద్దల ఆశలను అడియాసలు చేయకుండా తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. రానున్న ఎన్నికలలో పార్టీకి పట్టణంలో బలమైన నాయకత్వం అందించడమే కాకుండా, మెజార్టీ తీసుకు వస్తామన్నారు. అలాగే ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై నారయణరావు ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ విశాఖ రూరల్ జిల్లా కార్యదర్సి బుద్ద నాగజగదీష్ మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, కాండ్రెగుల సత్యవతి, కాండ్రేగుల విష్నుమూర్తి, తదితరులు ప్రసంగించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు, కార్యదర్సులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## దేవాంగుల సంక్షేమ సంఘం భవనం ప్రారంభించిన గంటా



భీమునిపట్నం : తగరపువలస లో దేవాంగుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 4వవార్డు కొత్తపేటలో రూ.4.50 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించిన దేవాంగుల సంక్షేమ సంఘం భవనం ను ప్రారంభించడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగుల సంక్షేమ సంఘానికి టీడీపీ ప్రభుత్వం చాలా కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే 40 ఏళ్ళు దాటిన వారికి ఫించన్లు ఇస్తుందని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో అప్పలనర్సింహరాజు, తగరపువలస పట్టణ టీడీపీ నాయకులు కొప్పలరమేష్, మాజీ చైర్ పర్సన్ కొప్పల ప్రభావతి,డిఎల్ డిఏ అధ్యక్షులు గాడు వెంకటప్పడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవ్వవెంకటరావు, టీడీపీ నాయకులు కొప్పలకృష్ణ దేవాంగుల సంఘం అధ్యక్షుడు దేశెట్టి కనకరాజు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలి

### రాష్ట్ర రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్‌మోహన్‌సింగ్



విశాఖపట్నం: ప్రపంచ బ్యాంకు నిధులతో అమలు చేస్తున్న విపత్తు పునరుద్ధరణ పథకం పనులను వేగవంతం చేయాలని రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్‌మోహన్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గవర్నర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ రాహుల్‌పాండేలతో కలిసి జిల్లాలో అమలు చేస్తున్న విపత్తు పునరుద్ధరణ పథకం పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మన్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ 2014 అక్టోబరులో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ నేపథ్యంలో రూ.2,220 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో విపత్తు పునరుద్ధరణ ప్రాజెక్టు పనులను రాష్ట్రంలో అమలుపర్చేందుకు చర్యలు చేపట్టడమైందన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విపత్తు పునరుద్ధరణ పథకం కింద జిల్లాలో రూ.1,450 కోట్ల విలువైన పనులు జరుగుచున్నాయని, అవి వివిధ దశల్లోనున్నాయని, వాటన్నింటినీ సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టడమైందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ వేణుగోపాల్, యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణమూర్తి తదితరులతో పాటు జివియంసి, వుడా, పంచాయితీరాజ్, రోడ్లు, భవనాలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 27, 28 తేదీలలో జాతీయ మత్స్యకార మహాసభలు

భీమునిపట్నం : ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాల్గవ మత్స్యకార సభలు అక్టోబర్ 27,28తేదీలలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరిపల్లి సందన్న అన్నారు.మండలం లోని చేపలుప్పాడలో మత్స్యకార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 రాష్ట్రాల,7 కేంద్ర పాలిత ప్రాంతాల మత్స్యకారులు తో సమావేశం అక్టోబర్27,28 తేదీలలో విశాఖపట్నం లో జరగనున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా తగరపువలస, చిట్టివలస,అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చేపలుప్పాడ, మంగమారిపేట లో సంఘం నాయకులు పర్యటించి సమావేశాలు నిర్వహించి ఆహ్వాన కమిటీ సమావేశానికి మత్స్యకార నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడ వజ్రం, జనరల్ సెక్రటరీ నెయ్యిల నాగభూషణరావు, ఉపాధ్యక్షలు చెల్లూరి బుజ్జి,వాసుపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి ఎవరు ?

పెద్దాపురం: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కుమారులు రాష్ట్ర వైఎస్ఆర్ సిపి అధ్యక్షులు అయిన వైస్ జనన్మోహనరెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ఈ నెల 21న పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ప్రవేశించనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో 2019 సాధారణ ఎన్నికలలో పెద్దాపురం నియోజకవర్గం నుండి వైఎస్ఆర్‌సిపి తరుపున పోటీ చేయనున్న అభ్యర్థి ఎవరు అన్న విషయం పెద్దాపురంలో చర్చనీ యాంశంగా మారింది. ప్రస్తుతం వైఎస్ఆర్‌సిపి కోఆర్డినేటర్‌గా తోట సుబ్బారావు నాయుడు కొనసాగుతున్నప్పటికీ ఈ స్థానంలో పోటీ చేయడానికి దొవులూరి దొరబాబు, గోలిదొర బాబు, బొడ్డు భాస్కరరామారావు, ముద్రగడ పద్మనాభం, సునీల్ వంటి పలువురి ప్రముఖుల పేన్లు విస్తృతంగా ప్రచారం చేయబుడుచున్నవి.

పెద్దాపురానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి అయిన చినరాజప్ప పట్టణాన్ని నియోజకవర్గాన్ని అనేకవిధాలు తీర్చిదిద్ది ప్రజల ఆధరాభిమానాలు పొందినట్లు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో చినరాజప్పను ధీటుగా ఎన్నికలలో ఎదుర్కొనగల వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి కొరకు పెద్దాపురం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

100 సంవత్సరాలు చరిత్ర కలిగి ఇంతవరకు 15 శాసన సభ్యులుగా పోటీచేసిన ప్రతిష్టాత్మకమైన పెద్దాపురం శాసనసభ స్థానానికి 2019 సాధారణ ఎన్నికలలో పోటీ చేసే బలమైన వైఎస్ఆర్‌సిపి అభ్యర్థిని జగన్మోహనరెడ్డి ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రారంభమైన మరిడమ్మ అమ్మవారి జాతర

పెద్దాపురం: పట్టణంలో వేంచేసియున్న మరిడమ్మ అమ్మవారి జాతర రంగరంగవైభవంగా ప్రాంభమైంది. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు, అమ్మవారిని దర్శించుకుని పండ్లు, చీరలు, రవికలు సమర్పించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ దేవాదాయ, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమీషనర్ రమేష్‌బాబు, చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజి పాలకమండలి సభ్యుల తదితరులు పర్యవేక్షించారు.

# గల్లంతైనవారు దొరికేవరకు గాలింపు

- హోంమంత్రి చినరాజప్ప



యానాం: పసుపులంక రేవులో గల్లంతైన విద్యార్థినిలు ఆచూకీ లభ్యమయ్యేవరకు గాలింపు జరుగుతుందని హోంమంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్‌లోని గౌతమీ గోదావరి వద్ద పర్యాటక జట్టి వద్ద ఆయన విలేఖరులతో మాట్లాడారు. పసుపులంక రేవులో జరిగిన ఘటన దురదృష్టకరమని అనుమతులులేని నాసిరకం పడవవలన ఈ ఘటన జరిగిందన్నారు. దీనికి బాధ్యులైన వారిపై ఆరు సెక్షన్ల క్రింది కేసు నమోదుచేయడం జరిగిందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గల్లంతైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నామన్నారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబు గంటగంటకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకుంటున్నారని వారి ఆచూకి కోసం తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీచేశారన్నారు. ఈ సమావేశంలో మహిళా కమీషనర్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కొందరి పొరపాటు వలన ఇటువంటి ఘటనలు జరిగి ప్రాణ నష్టం సంభవిస్తుందని ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన బాధిత కుటుంబాలను ఓదార్చలేనిదన్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత భరించలేనిదన్నారు. మానవతా దృకృథంతో వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ ఘటనను కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవలసిన బాధ్యత అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్ర, ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, రామచంద్రపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, కత్రేనకోన జడ్‌పిటిసి ఎన్, నాగేశ్వరరావు, తాళ్లరేవు జడ్‌పిటిసి పి. రామలక్ష్మి, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# వీధి మధ్యలో మురుగు



వీధి మధ్యలో మురుగు ఉన్న దృశ్యం

రావికమతం : దొండపూడి గ్రామంలోని కొప్పాకవారి వీధిలో ఇటీవల సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డుకు ఆ చివర ఈ చివర ఎత్తుగా నిర్మించి మధ్యలో పల్లంగా వదిలేశారు. దీనికి తోడు డ్రైనేజీ కూడా లేదు. దీంతో వీధిలో ఉన్న తాగునీటి బోరు వృధా నీరంతా రోడ్డు మధ్యలో నిలిచిపోతుంది. అలాగే ఇళ్లలోని వాడుక నీరు, వర్షం నీరు కూడా ఇప్పటికే చేరుతుంది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడటమే కాకుండా దోమలు, ఈగల వ్యాప్తి అధికమౌతుంది. రోడ్డు నిర్మించడం వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి నిలిచి ఉన్న నీటిని బయటకు పంపించే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

యలమంచిలి రూరల్ : జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో మిగులు సీట్ల భర్తీకి జిల్లాలోని ఏ కళాశాలలోనైనా ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని కొక్కిరాపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.నందిని తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, జూనియర్ ఇంటర్‌లో మిగులు సీట్లు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ కారణం చేతనైనా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోలేని వారు దరఖాస్తు చేసి సీటు రాని వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. బాలుర విభాగంలో 8, 9 తరగతులకు ఖాళీలు లేవని తెలిపారు. అలాగే ఖాళీల వివరాలు ఆయా పాఠశాలలను సంప్రదించాలని చెప్పారు. ఇంటర్మీడియేట్ దరఖాస్తు చేసుకున్న విద్యా ర్థులు ఈ నెల 18వ తేదీన, 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 19వ తేదీన విశాఖపట్నం నగర పరిధి శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలి పారు. నిబంధనల ప్రకారం భర్తీలు పూర్తి చేస్తామని, మరెన్ని వివరాలకు జిల్లా హెల్ప్ లైన్ డెస్క్ సెంటరు 0891 2799641 సంప్రదించాలని వారు సూచించారు.

# జ్ఞానాన్ని అందించే పుస్తకాలు రచించాలి

**వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**



ఆంధ్రాయూనివర్శిటీ : విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను అధ్యాపకులు రచించాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సెయింట్ జోసఫ్ కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి రచించిన శతమానం భవతి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వర్తమాన అంశాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించే విధంగా ఆచార్యులు పుస్తక రచనలు జరపాలన్నారు. బల్గేరియాలోని యూనివర్సిటీ ఆఫ్ సోఫియాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈస్ట్ కల్చర్ విభాగాదిపతి ఆచార్య మిలినా బ్రొటీవాను ఆయన అభినందించారు. హిందీ, సంస్కృత భాషలను యూరప్ దేశాలలో బోధించడానికి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య కె.వి రమణ, డాక్టర్ కె.శాంతి, క్రిష్ణవీర్ అభిషేక్, బి.వి.కె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీ గ్రంథాలయాన్ని పరిశీలించిన వీసీ



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న వీసీ నాగేశ్వరరావు

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం గ్రంథాలయాన్ని వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో విద్యార్థుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. గుర్తింపు కార్డులు లేనివారికి గ్రంథాలయం లోనికి అనుమతించవద్దని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ, పుస్తకాల నిర్వహణపు పరిశీలించారు. పుస్తకాలను సక్రమంగా బధ్రపరచాలని సిబ్బందికి చెప్పారు. వీసీ వెంట చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థిని మేనక ప్రతిభ



అచ్యుతాపురం: ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని మేనక జాతీయ రగ్బీ జట్టులో స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ కె. శ్రీనివాసురావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 15 తేదీలలో క్రిష్ణాజిల్లా మచిలిపట్నంలో జరిగిన జాతీయస్థాయి ఎంపికలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించిన మేనక ప్రతిభ కనబర్చింది ఈ నెల 24. 25 తేదీలలో మదురైలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రజట్టుకు మేనక ప్రాతినిధ్య వహిస్తుంది. ఈ సందర్భంగా మేనకను కళాశాల సిబ్బంది. రాష్ట్ర రగ్బీ సెక్రటరీ రామంజనేయులు అభినందించారు.

# గోదావరిలో గల్లంత్తైనవారి కోసం ఉమ్మడి గాలింపు

## మూడు మృతదేహాలు లభ్యం



యానాం/ఐ.పోలవరం: తూర్పుగోదవరి జిల్లా ఐ.పోలవరం మండలం పసుపులంక వద్ద శనివారం రేవు దాటుతుండగా గల్లంతైన ఏడుగురిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి ఇంకా నలుగురి ఆచూకి లభ్యం కావలసి ఉంది. ఈ నెల 14 వనం-మనం కార్యక్రమానికి పసుపులంక ఇతర స్కూల్‌లో హాజరై తిరిగి నావలో వెళ్తుండగా పసుపులంక రేవులో వంతెన నిర్మాణానికి ఏర్పాటుచేసిన పిల్లరను ఢీకొట్టిన ఘటనలో నావ తిరగబడి ఏడుగురు గల్లంతయ్యారు. మరో 16 మందిని అక్కడే ఉన్న స్థానికులు రక్షించారు. గల్లంతైనవారిలో ఆరుగురు విద్యార్థినిలు ఉండగా ఒక మహిళకూడా ఉన్నారు. మూడు రోజులుగా ప్రతికూల పరిస్థితుల మధ్య గజ ఈతగాళ్ళు, మత్స్యకారులు, విశాఖలోని



ఈస్టర్న్ నేవల్ కమేండో, డోర్నియా ఏయిర్‌క్రాఫ్ట్, హెలీకాఫ్టర్, నేవి డ్రైవింగ్ టీమ్‌లు గోదావరిలోని సుమారు 25 కిలోమీటర్ల పొడువునా ముమ్మరంగా గాలిస్తున్నారు. వరద ఉధృతి అధికంగా ఉండటం గల్లంతైన విద్యార్థులు అడుగుభాగంలో కూరుకుపోయి ఉంటారని మత్స్యకారులు, గజ ఈతగాళ్ళు అభిప్రాయపడుతున్నారు. సంఘటన జరిగిన ప్రదేశంలో గోదావరి అడుగుభాగంలో వలలువేసి జల్లెడ పట్టాలని వరద ఉధృతికి కోతకు గురైన బురదవలన ఈ పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే 25 బృందాలు 35 బోట్లపై గోదావరిలోని అణువణువు గాలిస్తున్నారు. గోదావరి వెంబడిఉన్న నదీపాయలు, మడఅడవులోని, సముద్రంలోను గాలిస్తున్నారు. ఆకాశం నుండి హెలీకాప్టర్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. అదే క్రమంలో ఆదివారం సాయంత్రం కొమరిగిరి వద్ద నదిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గమనించి అధికారులకు సమాచారం ఇచ్చేరు ఐ.పోలవరం మండలంలో శేరులంకకు చెందిన యువతి గెల్లా నాగమణి (30)గా గుర్తించారు. సోమవారం



మధ్యాహ్నం మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. బాగా కుళ్ళిపోయి ఉండటంతో అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఈ మృతదేహాలను సంబంధితులు గుర్తించవలసి ఉందన్నారు. ఈ ఘటన క్రమంలో బంధువులను ఓదార్చేందుకు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమాల రామకృష్ణుడు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్ర, ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, తోట త్రిమూర్తులు, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి బిజెపి నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను ఒదార్చారు. జరిగిన నష్టం పూడ్చులేనిదని ప్రమాదంలో గల్లంతైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుదని హోం మంత్రి చినరాజప్ప, మహిళా కమిషన్ చైర్మన నన్నపనేని రాజకుమారి తెలిపారు. ఘటన జరగడం దురదృష్టకరమని దీనిని రాజకీయం చేయడం ఎంతమాత్రం తగదన్నారు. పసుపులంక







వంతెన పూర్తిచేయడానికి ప్రభుత్వం రూ. 35 కోట్లు కేటాయించిందని దీనిని త్వరతిగతిన పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతిలేని బోట్లు, పడవలు గోదావరిలో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రెవెన్యూ అధికారులపై గ్రామస్తులు తిరుగుబాటు

ఐ.పోలవరం: నదిలో గల్లంతైన బాధిత కుటుంబాలను ఓదార్చడానికి వస్తున్న బంధువులను గ్రామంలోకి రాకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని ఏడు గ్రామాలకు చెందిన ప్రజలు రెవెన్యూ అధికారులపై తిరుగుబాటు చేసి రేవు వద్ద వేసిన టెంట్‌లను, కుర్చీలను ధ్వంసంచేశారు. సోమవారం ఉదయం అధికారుల వ్యవహారశైలిపై గ్రామస్తులు తిరుగుబాటుచేశారు. ప్రమాదం జరిగి మూడు రోజులు కావస్తున్న పడవలకు బదులు పంటి ఏర్పాటుచేయాలని హోంమంత్రి చినరాజప్పకు, ఎమ్మెల్యే దాట్ల బచ్చిబాబుకు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాకు విజ్ఞాప్తిచేశామని ఇప్పటి వరకు పంటి ఏర్పాటుచేయలేదని పడవపై ఎక్కడానికి అధికారులు అంక్షలు విధించడమేమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనుమతులులేని పడవలు నడిపిన వేలంపాటుదారుని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కూలి పనులుచేసేవారిని అరెస్టు చేయటమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు సంఘటన ప్రదేశంలో వలలతో జల్లెడ పట్టకుండా, గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టకుండా గోదావరిలో మృతదేహాలు తేలియాడితే పట్టుకుంటామని ధోరణిలో అధికారులు ఉన్నారని గ్రామస్తులు ఆక్రోశం వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులు కనిపించక కుటుంబ సోకసముద్రంలో ఉంటే ప్రభుత్వ నిర్లక్ష్యంవలన బాధ మరింత ఎక్కువ అవుతుందని వాపోయారు. ఈ ఘటనకు బాధ్యులు అయిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బ్రిడ్జి నిర్మాణ జాప్యం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందుకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రదేశానికి పోలీసులు వచ్చి గ్రామస్తులతో చర్చలు జరిపి శాంతిపచేశారు.

### నదీపాయపై బ్రిడ్జీలు నిర్మించాలి

**- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ**

ఐ.పోలవరం: కోనసీమలో ఉన్న నదీపాయలపై ప్రజల సౌకర్యార్థం మూడు గ్రామలలో ప్రభుత్వం బ్రిడ్జిలు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. పసుపులంక రేవులో జరిగిన ఘటన దురదృష్టకరమని దీనికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పసుపులంక వద్ద గతంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ 1.50 కోట్లతో బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపనచేశారని ఆ తరువాత మాజీ సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి ఈ బ్రిడ్జీకి రూ. 15 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. అప్పటి నుండి జాప్యం జరిగిందని టిడిపి ప్రభుత్వం రూ. 35 కోట్లు కేటాయించినా బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందన్నారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. అలాగే జి.మూలపాలంలో నదీపాయిపై పిల్లర్లు నిర్మించి అ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. నదీపాయలను అనుకుని ఉన్న గ్రామాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి బ్రిడ్జిలు నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గోదావరి మధ్యలో ఉన్న ఏడు గ్రామాలు మూడు నియోజకవర్గాల పరిధిలో ఉండటంవలన ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ ఏడు గ్రామాలను ఒకే మండల పరిధిలోకి తీసుకువస్తే సౌకర్య కల్పన ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

# విజయభాను సంపాదకీయం

## బడుగు వర్గాలపై దాడులు

రాజకీయ పార్టీల పరస్పర విమర్శలు ఎట్లా ఉన్నా, ఇటీవలి కాలంలో మతం పేరిట కొన్ని అవాంఛనీయ ఘటనలు సాగుతున్న మాట వాస్తవం. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో మూకదాడులు సాగడం సాధారణమైపోయింది. గో హంతకులు అనే ఆరోపణలతో బడుగు వర్గాలపై దాడులు సాగాయి. మహిళల వస్త్రధారణను నిర్దేశిస్తున్నారు. వాలంటీన్స్‌డే నాడు యువతీ యువకులు కలిసి కనిపిస్తే చాలు దాడులు సాగిస్తున్నారు. ఒక మనిషి ఏమి తినాలె, ఏ విధమైన దుస్తులు వేసుకోవాలె, ఏ వర్గం వారిని పెండ్లి చేసుకోవాలె, ఎవరిని చేసుకోకూడదు అంటూ శాసించే మూకలు ఇప్పుడు బరితెగించి తిరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వ్యాఖ్యలు, పరస్పర విమర్శలు తీవ్రమవుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రముఖుడు, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ బీజేపీపై చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా దుమారం లేపాయి. శశిథరూర్ గత బుధవారం కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటైన ఒక సదస్సులో భారతీయ ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి ఏర్పడిన ప్రమాదాలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ ప్రసంగంలో బీజేపీ 2019లో మళ్ళా సొంత మెజారిటీతో అధికారం చేపడితే మన దేశం హిందు పాకిస్థాన్‌గా మారే పరిస్థితులను సృష్టిస్తుందని వ్యాఖ్యానించారు. అల్ప సంఖ్యాక వర్గాలకు హక్కులు లేనటువంటి పాకిస్థాన్ మాదిరిగా మన దేశం మారడానికి కొత్త రాజ్యాంగాన్ని రచిస్తుందని కూడా హెచ్చరించారు. కొత్త రాజ్యాంగం హిందు రాష్ట్ర సూత్రాలను కలిగి ఉంటుందనీ, మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్ వంటి గొప్ప నాయకులు దేనికోసం స్వాతంత్ర్య పోరాటం చేశారో అ భారత్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడింది ఎన్నికల ప్రచార సభలో కాకుండా, సదస్సులోనే అయినప్పటికీ, ఒక జాతీయపార్టీ గురించి అంత కటువుగా మాట్లాడటం సబబా అనే ప్రశ్న తలెత్తుతున్నది. శశిథరూర్ కేంద్ర మాజీ మంత్రి, ఒక జాతీయ పార్టీ నాయకుడై ఉన్నందున, తన అభిప్రాయాలను కొంత మృదువుగా చెప్పి ఉంటే ఇంత వివాదాస్పదం కాకపోయేవి. శశిథరూర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఆమోదించకపోవడం గమనార్హం. భారత దేశ విలువలు, మౌలికాంశాలు మన నాగరిక పాత్రను పరిరక్షిస్తున్నాయనీ, ఆ విలువలే పాకిస్థాన్ విభజన సిద్ధాంతం నుంచి మనలను వేరు చేశాయని కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్ చీఫ్ రణదీప్ సుర్జేవాలా వ్యాఖ్యా నించారు. కాంగ్రెస్ నాయకులు తమపై ఉన్న చారిత్రక బాధ్యతను గుర్తించాలని, బీజేపీ విద్వేష రాజకీయాలను తిరస్కరించే క్రమంలో వాడే పదజాలం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మోదీ ప్రభుత్వం విభజన, విద్వేష, ఛాందసవాద, అసహన పరిస్థితులపై నాలుగేండ్లుగా మనుగడ సాగిస్తున్నదని, కాంగ్రెస్ పార్టీ బహుళత్వానికి, భిన్నత్వానికి, కారుణ్యానికి, మత జాతి సామరస్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్నదని ఆయన వివరించారు. బీజేపీ శశిథరూర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ క్షమాపణ వేడాలని డిమాండ్ చేసింది. ఆశ్చర్యకరమైన రీతిలో శివసేన బీజేపీపై ఎదురుదాడి చేసింది. ఆరెస్సెస్ ఎజెండాను శశిథరూర్ కాంగ్రెస్ వేదికపై నుంచి వినిపించారని శివసేన అధికార పత్రిక సామ్నా పేర్కొన్నది. రాముడు దిగివచ్చినా లైంగిక అత్యాచారాలను ఆపలేరు అంటూ యూపీలోని బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర నారాయణ్ సింగ్ వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా క్షమాపణ చెబుతారా అని శివసేన సవాలు చేసింది. బీజేపీతో సైద్ధాంతిక సారూప్యం గల శివసేన కాంగ్రెస్‌కు మద్దతుగా రావడం విశేషం. ప్రజాస్వామిక వ్యవస్థలో భిన్న భావజాలాలు ఉంటాయి. ఏ ఒక్క రాజకీయపక్షం తన సిద్ధాంతాలను సమాజంపై రుద్దలేదు. భిన్నత్వాన్ని ఆమోదిస్తూ, పరస్పర గౌరవంతో వ్యవహరించడమే ప్రజాస్వామిక వ్యవస్థలోని ఔన్నత్యమని రాజకీయపక్షాలు గ్రహించాలె. బీజేపీ నాయకులు శశిథరూర్‌పై విరుచుకు పడటానికి బదులు, రాజ్యాంగ విలువల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటే, అదే దీటైన సమాధానమవుతుంది. రాజకీయ పార్టీల పరస్పర విమర్శలు ఎట్లా ఉన్నా, ఇటీవలి కాలంలో మతం పేరిట కొన్ని అవాంఛనీయ ఘటనలు సాగుతున్న మాట వాస్తవం. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో మూకదాడులు సాగడం సాధారణమైపోయింది. గో హంతకులు అనే ఆరోపణలతో బడుగు వర్గాలపై దాడులు సాగాయి. ఒక మనిషి ఏమి తినాలె, ఏ విధమైన దుస్తులు వేసుకోవాలె, ఏ వర్గం వారిని పెండ్లి చేసుకోవాలె, ఎవరిని చేసుకోకూడదు అంటూ శాసించే మూకలు ఇప్పుడు బరితెగించి తిరుగుతున్నాయి. ఇవన్నీ ఇటీవలి కాలపు పోకడలు.

# గిరిజనుల పట్టా భుములను ఆన్‌లైన్ చేయాలి

### సిపిఎం అధ్వర్యంలో భారీ ఎత్తున అందోళన




దేవరాపల్లి : మండలంలోని వాలాబు ,గరిసింగి ,చింతలపూడి పంచాయతీలో డి పారం పట్టా భూములు ఇచ్చి ఆన్ లైన్ చేయని భూములకు ఆన్ లైన్ చేయలని డిమాండు చేస్తూ సిపిఎం అధ్వర్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున అందోళన చేపట్టారు .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి .వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ,పాసు పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు .వీటిని ఆన్ లైన్ చేయలని గతంలో అనేక సార్లు దర ఖాస్తులు పెట్టుకున్న అధికారులు పట్టించు కోలేదన్నారు. దీని వలన గిరిజనులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు ఆన్ లైన్ జరగలేదని ,ఇప్పటికైనా అధికారులు స్పందించి వేంటనే ఆన్ లైన్ చేయాలని డిమాండు చేసారు. అంతకు ముందు దేవరాపల్లిలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద అందోళన చేసారు .ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సి హెచ్ .రాజు ,బి .పేరయ్యా ,టి .శంకర్ ,చిన దేముడు తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో

# పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదంటూ రాస్తారోకో




అచ్యుతాపురం: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, కార్మికులను కొనసాగించి కనీస వేతనం రూ.5వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైస్కూల్ నుంచి ర్యాలీగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఈ పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినదిం చారు. సెంటర్‌లో అర్థగంటపాటు రాస్తారోకో నిర్వ హించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లా డుతూ ఈ ప్రభుత్వం మహిళా సాధికారత అని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 85 వేల మంది వంట అమ్మలు పొట్టకొట్టే నిర్ణయం తీసుకోవడ మేనా అని విమర్శించారు. బాబు వస్తే జాబు వస్తుందని అని చెప్పి నేడు బాబుగారు 85వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు సెప్టెంబర్ 15 నుంచి చేయరాదని నోటీసులు పంపడం అత్యంత దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఎండిఎం కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఆర్.రాము, జిల్లా నాయకులు ఎస్. బ్రహ్మజి, కె.సోమునాయుడు, జి.దేముడునాయుడు, ఎండిఎం నాయకులు శాంతి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, వరలక్ష్మి, మాణిక్యం, కృష్ణవేణి, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి : కోలగట్ల



విజయనగరం: వ్యాపా రులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీఅని శాసనమండలి సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం పిడబ్ల్యు మార్కెట్‌లో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు, రిటైల్ కిరాణావ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నాలుగేళ్ల చంద్రబాబు పాలనలోవ్యాపార వ్యతిరేక నిర్ణయాల వల్ల వ్యాపారులు నష్టపోయే పరి స్థితులు ఏర్పడ్డాయన్నారు. రాజన్నరాజ్యం తిరిగి రావాలంటే జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఈనెల17న మంగళ వారం ఉదయం 10 గంటలకు నాయుడు ఫంక్షన్ హాల్‌లోజరిగే పట్టణవాణిజ్య విభాగ ఆత్మీయ సమావేశానికి వ్యాపారులంతా హాజరు కావాలన్నారు. వైఎస్‌రాజశేఖరరెడ్డి హయాంలో అన్ని వర్గాల ప్రజలు రాజన్నరాజ్యం చూసారని,తిరిగి ఆరాజ్యం రావాలంటే వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలుతెలుసుకుని వారికి బాసటగా నిలుస్తున్న వ్యక్తి జగన్ అని అన్నారు.ప్రత్యేక హోదా కోసంగత నాలుగేళ్లుగా అనేక పోరాటాలు చేస్తూ ప్రజల తరపున నినదిస్తున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్సీ కోలగట్లను సత్క రించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొద్దాన అప్పారావు, గుజ్జల నారాయణరావు, ఎం.కె.బి. శ్రీను, మహేష్,సాయి, వ్యాపారులు పాల్గొన్నారు.

## సీతానగరంలో పర్యటించిన సీతారాం

అనకాపల్లి : గ్రామంలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారామ్ తెలిపారు. జనసేన పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన మండలంలోని సీతానగరం గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండిపోవడం వలన ఇబ్బంది పడు తున్నాయని, గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే దహనసంస్కారాలకు ఇబ్బందులు పడు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి కాలనీలో ఉన్న సామాజిక భవనం మరమ్మతులకు నోచుకోక అక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోలేక పోతున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు భరిణికాన రాము, బొబ్బిలి రమణ, దూలం గోపి, కాండ్రేగుల సునీల్, సురభ హరీష్, గల్లా వినోద్, మంగ, ఈశ్వర్, వాకాడ మదన్, దిండి ఈశ్వర, ఎవి శ్యామ్, బుదిరెడ్డి వెంకట్, యల్లంకి గోవింద్, శ్రీను, అనిల్, గొర్లి శివ, దాడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## మనిషి ప్రవర్తన

మంచి మనస్సు ఆలోచనా ధోరణి
సమాజ శ్రేయస్సు, పరుల హితం
పరోపకారం, క్షమాగుణం
సహనం, సర్వజీవ సమానత్వం
సాత్విక ప్రవర్తన, మితభాషణం
సజ్జన సాంగత్యం, ప్రేమతత్వం
సత్పురుషుల ఆలోచనా తత్వం
మనందరికీ స్ఫూర్తిదాయకం
కోరికలను నియంత్రించుకోవడం
అరిషడ్వర్గాలను లోబరుచుకోవడం
మానవసేవే ప్రధాన కర్తవ్యంగా
ముందుకు సాగడం అవశ్యం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : నిజ జ్యేష్ఠ ; తిథి : పంచమి రా.9.39; పుబ్బ మ.3.07; రా.వ.10.01ల 11.33

మంగళవారం 17-07-2018

**మేషం** : ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్ట మవు తుంది. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసి వస్తుంది. బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపు తున్నపుడు ఏకాగ్రత ముఖ్యం.నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిథునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.మీ స్థోమ తకు మించిన వాగ్ధానాల వల్ల ఇబ్బందుల ఎదుర్కొం టారు.

**సింహం** :పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమ వుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసు కోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగి పోగలవు. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శు భదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగ స్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయులకు పనిభారం అధిక మవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

### గాజువాక నియోజకవర్గంలో

# అర్హులందరికీ పక్కా గృహాలు



గాజువాక: నియోజకవర్గంలో అర్హులందరికీ పక్కా గృహాలను అందివ్వనున్నట్లు స్థానిక తెదేపా ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జీవీయంసీ 56వ వార్డు అగనంపూడిలో నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో పేదవారికి 300ఇళ్ళు మంజూరుకాగా 1500 ఇళ్ళకు గృహప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే ఎన్నికలలో ఇచ్చిన అన్నీ హామీలను నెరవేర్చుతున్నట్లు తెలిపారు. పలు అభివృద్ధికార్యక్రమాలను వివరించారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆదర్శ నియోజకవర్గంగా గాజువాకను తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బలిరెడ్డి , విళ్ళారమ్మోహన్ రావు, పప్పురాజారావు, పల్లాశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# దేశం నాయకులను నిలదీయండి: వైయస్సార్ పార్టీ పిలుపు



విజయనగరం: నాలుగేళ్ల పాటు రాష్ట్రంలో అధికారం చెలాయించి, అన్నివర్గాల ప్రజలను మోసం చేసి తమ ప్రభుత్వం ఏర్పడి 1500 ల రోజులు పూర్తయ్యాయన్నపేరుతో తగుదనమ్మాని గ్రామదర్శినిపేరుతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్న తెలుగుదేశం ప్రజా ప్రతినిధులు, నాయకులను నిలదీయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీనాయకులు జిల్లానుఏమి అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. తోటపల్లి జలాశయాన్ని తామే ప్రారంభించామని ఆ పార్టీ నేతలు చెప్పడం వారికి దాని చరిత్ర తెలియదని బావించ వలసి వస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి పాలనలో నాటి మంత్రి బొత్స సత్య నారాయణ కృషి ఫలితంగా తోటపల్లి కాలువలనుండి నేడు నీరు వస్తుందన్న విషయం వారు తెలుసుకోవాలని ఆయన అన్నారు. విజయ నగరం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేటందుకు డా॥ రాజశేఖరరెడ్డి , బొత్స సత్యనారాయణలు తారకరామతీర్థసాగర్ నిర్మాణం ప్రారంబిస్తే, పట్టణంలో ఇంటింటికి త్రాగునీరు కొళాయిలు ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ ఆ ప్రాజెక్టు ఎందుకు విస్మరించిందని శ్రీనివాసరావు ప్రశ్నించారు.ఈ జిల్లానాయకులు జిల్లాకు కొత్త ప్రాజెక్టులు ఏమైనా తెచ్చారా అని ఆయన నిలదీశారు. విజయనగరం , బొబ్బిలి ప్రాంతాలలో జ్యూట్ పరిశ్రమలు మూతపడి కార్మికులు రోదిస్తూంటే ఈ ప్రాంత పార్లమెంటు సభ్యులు అశోక్ గజపతిరాజు, రాష్ట్రమంత్రి సుజయ్ కృష్ణ రంగారావులు జ్యూట్‌మిల్లులు తెరిపించే బాధ్యత ఎందుకు తీసుకోలేదన్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికి ప్రభుత్వ డిగ్రీకాలేజీ లేక పోవడం అశోక్, సుజయ్‌ల అసమర్ధతకు అద్దం పడుతుందన్నారు. కేంద్రరాష్ట్రప్రభుత్వాలు ప్రకటించిన గిరిజన యూనివర్సిటీ, ప్రభుత్వ వైద్యకళాశాల, ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలు ఎందుకు ముందుకు కదలలేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు.ఈ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి అధమస్థాయిలో అవినీతి అగ్రస్థానంలో ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. పేదవారికి ఇల్లు, వృద్దులకు పించను కావాలంటే ఆపార్టీనాయకులకు, జన్మభూమి కమిటీ సభ్యులకు పేదలు లంచాలు ఇవ్వవలసిన దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తూ జిల్లా మంత్రి సుజయకృష్ణరంగారావే భూదందాలకు తెరతీసారని శ్రీనివాసరావు ఆరోపించారు. తెలుగుదేశం నాయకులు అభివృద్ధి,సంక్షేమం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు ఆరోపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నాలుగేళ్లలో ఆపార్టీ నేతలు అక్రమార్జనద్వారా ఆస్థులు పెంచుకోవడం మినహా ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన అన్నారు. 2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ, డ్వాక్రామహిళల రుణాలు రద్దు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అంటూ ఇలా అన్నివర్గాల ప్రజలకు హామీలుఇచ్చి చంద్రబాబునాయుడు అన్నివర్గాలను మోసగించారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ స్వార్ధంతో అంగన్‌వాడి, ఆశా కార్యకర్తల జీతాలు పెంచడం, అన్నా కేంటినులు ఏర్పాటు చేయడం ఆయనలో గల అధికార దాహాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు.పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా॥ రాజశేఖరరెడ్డి పాలనలో ఫీజురియంబర్సుమెంటు సహాయంతో ఎందరో పేదవిద్యార్థులు ఉన్నతవిద్యావంతులుగా ఎదిగారని ఈ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో పేద విద్యార్ధులు ఆదిశగా ఎదగ లేకపోతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఈ ప్రభుత్వం 260 రోగాలను ఆ పథకం నుండి తొలగించడం పేదల పట్ల ఈ ప్రభుత్వానికి గల వ్యతిరేకతను తెలియజేస్తుందన్నారు.

# చిత్రభాను

## ఉత్కంఠగా మోహిని థియేట్రికల్ ట్రైలర్



'మోహిని' థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. 'ఎన్నో వేల సంవత్సరాలుగా పూడ్చి పెట్టబడిన నిజం' అంటూ ప్రారంభమైన ట్రైలర్ అద్యంతం ఉత్కంఠగా సాగింది. అసలు మోహిని ఎవరు? ఆమెను ఎవరు చంపారు? త్రిష శరీరంలోకి మోహిని ఆత్మ ఎలా ప్రవేశించిందనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఒకప్పుడు కథానాయికగా అగ్ర హీరోలందరి సరసన నటించిన త్రిష.. 'నాయకి'గా కథానాయిక ప్రాధాన్యమున్న హారర్ కామెడీ జోనర్ చిత్రంలో నటించి మెప్పించారు. ఇప్పుడు మరోసారి భయపెట్టేందుకు సిద్ధం అంటున్నారామె. ఆమె కీలకపాత్ర పోషిస్తున్న తమిళ చిత్రం 'మోహిని'. ఆర్. మాదేష్ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది. జులై 27న ఈ సినిమాను తమిళ, తెలుగు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగులోనూ 'మోహిని' పేరుతోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా సోమవారం చిత్ర బృందం

ప్రిన్స్ పిక్చర్స్, శ్రీలక్ష్మి పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.లక్ష్మణ్‌కుమార్, శ్రీనివాసరావు, కరణం మధులతలు నిర్మిస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాదేష్ మాట్లాడుతూ.. 'హీరోయిజం అనేది ఎప్పుడూ హీరో దృక్కోణం నుంచే ఉంటుంది. కానీ, మేము దాన్ని హీరోయిన్ వైపు నుంచి చూపించాలని అనుకున్నాం. అందుకు మాకు కనిపించిన ఏకైక నటి త్రిష. ఇందులో ఒక సామాజిక సమస్యను కూడా ప్రస్తావించాం. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా అది ఉంటుంది. ముఖ్యంగా మహిళలు దీనికి కనెక్ట్ అవుతారు' అని తెలిపారు.

## న్యూయార్క్ వీధుల్లో ప్రియాంక చిందులు



'గ్లోబల్‌స్టార్' ప్రియాంకచోప్రా న్యూయార్క్ నగర వీధుల్లో చిందులు వేశారు. ఎంతలా అంటే ఎవరూ మనల్ని చూడటం లేదని తెలిస్తే ఎలా డ్యాన్స్ చేస్తామో ఆ రేంజ్‌లో చేశారు. ఇంతకీ ప్రియాంక ఎందుకు డ్యాన్స్ చేయాల్సి వచ్చిందనే కదా! మీ అనుమానం. బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లి 'గ్లోబల్‌స్టార్'గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్'. టాడ్ స్ట్రాస్ దర్శకత్వం వహిస్తున్నారు. రెబల్ విల్సన్, ఆడమ్ డివైన్, లామ్ హ్యామ్‌వర్త్, బెట్టీ గిల్పిన్‌లు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సందర్భంగా చిత్రంలోని ఓ సన్నివేశాన్ని మాన్‌హట్టన్‌లోని పార్క్ అవెన్యూ 40వ వీధిలో తెరకెక్కించారు. ఇందులో తోటి నటీనటులు రెబల్ విల్సన్, ఆడమ్ డివైన్, లామ్ హ్యామ్‌వర్త్‌లతో కలిసి ప్రియాంక చిందులు వేశారు. ప్రస్తుతం ఈ వీడియో, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. మనుషులంటే అస్సలు ఇష్టంలేని ఒక మొండి అమ్మాయి జీవితంలో ప్రేమ ఎలా చిగురించింది? అందుకు కారణం ఎవరు? ఆ తర్వాత ఆమె జీవితం ఎలా సాగింది? అనే ఇతి వృత్తంతో 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో ప్రియాంక ఇసబెల్లా అనే యోగా అంబాసిడర్ పాత్రలో కనిపించనున్నారు. 'బేవాచ్'తో హాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన ప్రియాంక ప్రస్తుతం అమెరికన్ టెలివిజన్ సిరీస్ 'క్వాంటికో'లోనూ నటిస్తున్నారు.

## భీమిలిలో మెగా వైద్యశిబిరం ప్రారంభం



వైద్య శిబిరంను ప్రారంభించిన మంత్రి గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం : పేదల ఆరోగ్యం మెరుగు పరచాలనే ఉద్దేశ్యంతో మన ముఖ్యమంత్రి ప్రజలవద్దకు వైద్యసేవలను అందు బాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక బీచ్ సమీపంలో అమెరికన్ ప్రోగ్రసివ్ తెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంబించడానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అధికంగా ఖర్చు పెట్టి ఆసుపత్రికి వెళ్ళలేనివారుంటారని వారు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్య నిపుణల తో ఉన్నత వైద్య సేవలు ఉచితంగా భీమిలి ప్రజలకు అందించిన అప్త వారిని మంత్రి సన్మానించారు. ఇందులో సుమారు 500 మందికి తని ఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఆర్.ఎస్. డి.పి. అప్పలనర్సింహరాజు, గంటాప్రతినిధి చిక్కాల విజయ్ బాబు, డీఎల్టిడిఎ చైర్మన్ గాడు వెంకటప్పడు, కోరాడ నాగభూషణరావు, భీమిలి ఎం.పి.పి. యరబాల.కృష్ణ వేణి, తెలుగు మహిళా అద్య క్షురాలు కురుమిన లీలావతి, భీమిలి, తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు, కొప్పలరమేష్, మాజీచైర్ పర్సన్ కొప్పల.ప్రభావతి, జహనారా, యరబాల అనీల్ ప్రసాద్, పి.యోగి, కాసరపు నాగరాజు, దాసరి. వెంకటేష్, గిడుతూరి శ్రీనివాస్, జి.పోలిరాజు పాల్గొన్నారు.

## కుమ్మేస్తున్న ఎన్టీఆర్.. దిమ్మతిరిగేలా అరవింద సమేత






యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న అరవింద సమేత చిత్రంపై భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ విడుదలైన తర్వాత క్రేజ్ మరింత పెరిగింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన వార్తలు సినీ, ప్రేక్షక వర్గాలలో చర్చనీయాంశమవుతున్నాయి. తాజాగా అరవింద సమేత చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ బిజినెస్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.

ఆంధ్రాలో అరవింద సమేతంగా ప్రిరిలీజ్ బిజినెస్ కుమ్మిపడేస్తున్నది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. వైజాగ్ మినహాయించి ఆంధ్రాలో రూ.40 కోట్లకుపైగా బిజినెస్ చేసినట్టు తెలిసింది. ఇది ఎన్టీఆర్ సినిమాకు ఉన్న స్టామినాను చెప్పకనే చెబుతున్నది. వైజాగ్‌లో ఎన్టీఆర్ తడాఖా ఇక సీడెడ్ విషయానికి వస్తే అరవింద సమేత రూ.11 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసినట్టు సమాచారం. వైజాగ్ ఏరియాలో కూడా భారీ బిజినెస్ జరిగే అవకాశం ఉంది. ఈ చిత్రం సుమారు 10 కోట్ల రూపాయాల బిజినెస్ చేయవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నైజాంలో అరవిందకు ఫ్యాన్సీ ఆఫర్ అరవింద సమేత నైజాం ఏరియా హక్కుల విషయం ఇంకా చర్చల దశలోనే ఉన్నట్టు తెలిసింది. సుమారు రూ.20 కోట్ల వరకు ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగే అవకాశం లేకపోలేదు.

ఓవర్సీస్‌లో ఇప్పటికే రూ.12 కోట్ల బిజినెస్ జరిగిన విషయం తెలిసిందే. మరో హిట్టుపై ఎన్టీఆర్ నజర్ వరుస విజయాలతో దూసుకెళు న్న యంగ్ టైగర్ ఎన్టీఆర్ అరవింద సమేత.. వీర రాఘవ చిత్రంతో మరో సెన్సేషనల్ హిట్‌ను సొంతం చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు.

ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నది. నాగబాబు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 10వ తేదీన రిలీజ్‌కు సిద్ధమవుతున్నది.

## అభివృద్ధి, సంక్షేమ పథకాలే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం





విశాఖపట్నం : తెలుగుదేశం ప్రజాపాలన సాగిస్తోందని , పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ధ్యేయంగా పని చేస్తోందని విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం 15వ వార్డు రామాలయం వీధిలో గ్రామ దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షమమే లక్ష్యంగా, అభివద్ధి, సంక్షేమ పథకాల అమలు, పేదరిక నిర్మూలనకు తెలుగు దేశం పార్టీ కృషి చేస్తోందని అన్నారు. పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా కొంతమంది నిరుపేదలకు ఇళ్లను ఇప్పించినారు. ఎట్టి పరిస్థితులలోనూ దళారిలను నమ్మి మోసపోవద్దని లబ్ధిదారులకు హెచ్చరించారు. ఆ విధంగా డబ్బులు ఎవరయినా అడిగితే తనకు తెలియజేయమని ప్రజలను కోరారు. కుర్చీ కోసం జగన్ పాకులాడుతున్నారని, వైకాపా అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం అనేక అబద్ధపు వాగ్దానాలు చేస్తోందని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పథకాలకు ప్రజలు ఆకర్షితులౌతున్నారని అన్నారు. వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

గ్రామ దర్శినికార్యక్రమంలో భాగంగా జెండా ఊపి కార్యకర్తలతో కలిసి పలు వీధుల కలియ తిరిగి వార్డు ప్రజల సమస్యలు దగ్గరుండి అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేద, బడుగు, బలహీన, బీసీలు, మైనార్టీ వర్గాల అభివృద్ధికి తామెంతగానో కృషి చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో 15వ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివ ప్రసాద్, కోటేశ్వర రెడ్డి, కోటేశ్వరరావు, శంకరరరావు, గంట్యాడ శంకరరావు, సింహాచలం, బంటుపల్లి సూర్యనారాయణ, రాజు, విల్లూరి చక్రవర్తి, బొచ్చా రాముడెడ్డి, తదితర తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎసిపి పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సునీత

భీమునిపట్నం : స్థానిక అంద్రచైతన్య పార్టీ కార్యాలయం లో కార్యవర్గ సభ్యుల పేరులను ఆ పార్టీ అద్య క్షులు కంటుభుక్త రామానాయుడు తెలిపారు, భీమిలి నియోజకవర్గ ఇన్ చార్జ్ గా కంటుభుక్త.సునీత, తగరపువలసకు పార్టీ అద్యక్షులు గాదం గురునాదం, భీమిలి పార్టీ అద్యక్షులుఎర్ని.శారదా దేవి లను నియమించామని ఆయన తెలిపారు.

### 200 మందికి హోమియో వైద్య సేవలు

భీమునిపట్నం : స్థానిక చిన్నబజార్, డచ్ రోడ్డు వద్ద కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం 200 మంది కి ఉచిత పరిక్షలు నిర్వహించన్నట్లు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి చెప్పారు.

# భక్తుల మనోభావాలు దెబ్బతినరాదు

### తిరుమల మూసివేత తగదు .. పీఠాధిపతుల సలహాలు తీసుకోవాలి
### భక్తుల అనుమానాలకు తావీయరాదు .. విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి

ఋషీకేశ్: తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టనున్న మహాసంప్రోక్షణ విషయంలో తీసుకున్న నిర్ణయంపై స్వామి వారు స్పందిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయం మూసివేతపై పలువురు భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని మహాస్వామి పేర్కొన్నారు. జూలై 27 నుండి సెప్టెంబర్ 25 వరకు చాతుర్మాస్య దీక్ష నిమిత్తమై ఋషీకేశ్‌లో దీక్ష ప్రారంభించిన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకున్న నిర్ణయంపై స్పందించారు. ఆగస్టు 9 నుండి 16వ తేదీ వరకు తిరుమల దేవాలయాన్ని మహాసంప్రోక్షణ పేరుతో మూసివేత తగదని అన్నారు. దీనివలన భక్తులు చాలా మంది బాధపడుతున్నారని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా తితిదే ఏ నిర్ణయం తీసుకున్నా ఆగమ సలహా మండలి పీఠాలైన శృంగేరి వంటి పీఠాలలో గల ఆగమ పండితులతో సూచనలు తీసుకుంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. టిటిడి మండలి సలహాలు తీసుకునేటప్పుడు కార్యాలయంలో సీసీ కెమెరాలు నిలుపుదల చేయరాదన్నారు. కావున, టిటిడి మరియు ప్రభుత్వం కూడా సరియైన నిర్ణయం తీసుకోవాలన్నారు.





పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్. ఈ కార్యక్రమంలో పోలియో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలి

### రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య



విశాఖపట్నం: దోమల వల్ల వ్యాధులు ప్రబలేదాకా వేచి ఉండకుండా, లార్వా దశలోనే దోమల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామ పంచాయితీల్లో పక్షం రోజుల పాటు స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్‌లు నిర్వ హించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాల కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబరులో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, కెజిహెచ్, జివియంసి వైద్య విభాగం, యుసిడి, డిఆర్‌డిఎ శాఖల అధికారులతో సమావేశమై ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఏజెన్సీ, జివియంసి శివారు ప్రాంతాల్లో విజృంభించిన డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నియంత్రణకు జిల్లా కలెక్టర్ ప్రవీణకుమార్ చూపిన చొరవ మంచి ఫలితాలు ఇచ్చిందని అభినందించారు. రానున్న మూడు మాసాల్లో విస్తారంగా వర్షాలుపడే అవకాశాలు వున్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో తగినన్ని మందులు, రక్తపరీక్షల కిట్లు తగినన్ని నిల్వవుంచుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్-2 ఎ.సిరి, డా.రమేష్, డా.అర్జున్, డా.నాయక్, మణి, కృష్ణకుమారి, రమణమూర్తి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జన నేతతో జగన్నాథం

విశాఖ సిటీః వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తూర్పు గోదావరి జిల్లా వనవర్తిలో పాదయాత్రలో భాగంగా బిక్కవోలు నుండి గొల్లల మామిడి వరకు జగన్‌మోహన్ రెడ్డితో పాటు వైకాపా రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం పాదయాత్రలో పాల్గొన్నారు. విశాఖ పార్లమెంట్ ఎస్.కోట నియోజకవర్గంపై ఆయన చర్చించారు. ఈ విషయంపై ఇద్దరు ఒక నిర్ణయం తీసుకున్నారు.

# మోదీకి మద్దతిస్తాం - రాహుల్‌గాంధీ

దిల్లీ: మహిళల రిజర్వేషన్ బిల్లును ఆమోదించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఇదే విషయమై ప్రధాని మోదీకి లేఖ కూడా రాసినట్లు రాహుల్ ట్విటర్ ద్వారా వెల్లడించారు.

మహిళల సాధికారత కోసం పోరాడుతానని ప్రధాని మోదీ చెబుతుంటారు కదా. ఇప్పుడు ఆయన రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాల్సిన సమయం వచ్చింది. పార్లమెంట్ సమావేశాల్లో మహిళల రిజర్వేషన్ బిల్లుకు ఆమోద ముద్ర పడాలి. ఈ విషయంలో ప్రధాని మోదీకి కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుంది అని రాహుల్ ట్వీట్ చేశారు. ఈ విషయాన్ని లేఖ ద్వారా ప్రధానికి తెలియజేసినట్లు రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు.



త్వరలో జరగబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా చూడాలని ప్రధాని మోదీని కోరుతున్నాను. మీకు తెలుసు 2010 మార్చిలో ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. అయితే గత ఎనిమిదేళ్లుగా లోక్‌సభలో మాత్రం ఆమోద ముద్ర పడట్లేదు. 2010లో రాజ్యసభలో అప్పటి ప్రతిపక్ష నేత అరుణ్ జైట్లీ ఈ బిల్లును చరిత్రాత్మకం అని ప్రశంసించారు. అయితే ఇప్పుడు భాజపా దీనిపై మరో ఆలోచనలో ఉన్నట్లు అనిపిస్తోంది.

బహిరంగ సభల్లో చాలా సార్లు మీరు మహిళా సాధికారత గురించి మాట్లాడారు. మరి ఈ సారి అయినా బిల్లుకు ఆమోద ముద్ర పడుతుందా..? బిల్లు ఆలస్యమవుతుందా? ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీ మీకు పూర్తి మద్దతిస్తుంది అని రాహుల్ లేఖలో పేర్కొన్నారు.

# నాలుగు దశాబ్దాల తర్వాత.. ముందస్తు బెయిల్

లఖ్‌నవూ: దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఉత్తర్‌ప్రదేశ్ వాసులు ముందస్తు బెయిల్ పొందే అవకాశం రాబోతుంది. ముందస్తు బెయిల్‌కు సంబంధించిన చట్టాన్ని తిరిగి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయాన్ని సోమవారం యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఇప్పటి వరకు యూపీ, ఉత్తరాఖండ్‌లలో మాత్రమే ముందస్తు బెయిల్ పొందే అవకాశం లేదు. ఈ ప్రాంతాల్లో నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో నేరస్థులు అరెస్టు నుంచి తప్పించుకోకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ ఆప్షన్‌ను ఈ రెండు రాష్ట్రాల్లో అందుబాటులో లేకుండా చేశారు. ఈ సదుపాయం లేకపోవడం వల్ల క్రిమినల్ కేసుల్లోని నేరస్థులను పోలీసులు వెంటనే అరెస్టు చేస్తున్నారు.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# కూర్మ దర్శనం సర్వపాపహరణం



అగనంపూడిః జగన్నాథుని దర్శనం సర్వపాపహరణం అని ఆలయ కమిటీ చైర్మన్ జి. వెంకటరావు అన్నారు. సోమవారం ఉదయం జగన్నాథుని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్నాథుని రథయాత్ర సందర్భంగా 10 రోజులు 10 అవతారములు వేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 2వ రోజు జగన్నాథుడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చాడన్నారు. జగన్నాథుని పూజా కార్యక్రమంలో అగనంపూడి జగన్నాథస్వామి ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాథస్వామి విగ్రహాన్ని కుర్మావతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా ఇ.ఓ. దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం 10 గంటల నుండి లలితా పారాయణ జరిగింది. సాయంత్రం షిరిడి సాయి భజన మండలిచే భజన బృంద కార్యక్రమం కడు రమ్యంగా సాగింది. ఈ సందర్భంగా ఆర్‌హెచ్‌సి ప్రజలు స్వామి వారిని దర్శించుకుని తరించారని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

# టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా రమేశ్ పవార్

ముంబయి: భారత క్రికెట్ జట్టు కోచ్ బాధ్యతలను మాజీ క్రికెటర్ రమేశ్ పవార్‌కు అందజేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. అదేంటి కోహ్లీ సేనకు రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నాడు కదా. మరి ఇదేంటా అని ఆలోచిస్తున్నారా. రమేశ్ పవార్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టింది కోహ్లీ సేనకు కాదు మిథాలీ రాజ్ సేనకు. అంటే భారత మహిళల క్రికెట్ జట్టుకు.

కొద్ది రోజుల క్రితం భారత్ మహిళల జట్టు కోచ్ తుషార్ ఆ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సీనియర్ క్రీడాకారిణులు కోచ్ పద్ధతి సరిగా లేదంటూ బీసీసీఐకి ఫిర్యాదు చేయడంతో తుషార్ రాజీనామా చేశారు. దీంతో మహిళల జట్టుకు తాత్కాలిక కోచ్‌గా మాజీ క్రికెటర్ రమేశ్ పవార్‌ను ఎంచుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. జులై 25 నుంచి బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో మిథాలీ సేన శిక్షణ తీసుకోనుంది. అప్పటి నుంచే రమేశ్ జట్టుతో కలవనున్నాడు. బీసీసీఐ ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు నాకు అప్పగించింది. ఎంతో సంతోషంగా ఉంది. భారత జట్టు మంచి విజయాలు సాధించేలా కృషి చేస్తా అని పవార్ తెలిపారు.

వచ్చే నెలలో భారత మహిళల జట్టుకు పూర్తి స్థాయి కోచ్‌ను ఎంపిక చేస్తాం. ఇందుకోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశాం. జాతీయ జట్టు లేదా రాష్ట్రానికి చెందిన ఫస్ట్ క్లాస్ జట్టుకు కోచింగ్ బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్న 55 సంవత్సరాలలోపువారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చిన బీసీసీఐ తెలిపింది.

ఈ నెల 20లోగా దరఖాస్తులు పంపాలని సూచించింది. రమేశ్ పవార్ భారత్ తరఫున 2 టెస్టులు, 31 వన్డేలు ఆడారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com